Bhavya Sai
PHOTO & VIDEO FILMING
Event Photo & Videography
Best Price
Photos & Videos Delivered
with in 24 Hrs...
Press Events PRO in Vizag
CELL 9948511438

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 180 విశాఖపట్నం, 29 ఏప్రిల్ 2025 మంగళవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

విలేఖరులు కావలెను
రాజమండ్రి, చాగల్లు, నిడదవోలు, దేవరపల్లి మండలాలకు విలేకరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్ : 9100986584, 9553574250



## సిలికాన్ వ్యాలీలో కంపెనీల సీఈవోలంతా తెలుగోళ్లు, భారతీయులే

### హైదరాబాద్‌లో 14 నెలల్లోనే గతంలో హైటెక్ సిటీ పూర్తి సీఎం చంద్రబాబు

**అమరావతి:** హైదరాబాద్‌లో 14 నెలల్లోనే గతంలో హైటెక్ సిటీ పూర్తి చేసినట్లు సీఎం చంద్ర బాబు తెలిపారు. భవిష్యత్ అంతా ఐటీదేనని అప్పట్లో తల్లిదండ్రులకు పిలుపునిచ్చామని చెప్పారు. స్టార్టప్ కంపెనీల కోసం వి-లాంచ్ పాడ్ 2025ని చంద్రబాబు ఆవిష్కరించారు. అమరావతిలోని విట్ వర్సిటీలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. " అప్పట్లో ఐటీని ప్రమోట్ చేశా.. ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీని ప్రమోట్ చేస్తున్నా. ఒకప్పుడు ప్రభుత్వ అటెండర్ ఉద్యోగానికి కూడా డిమాండ్ ఉండేది. ఇప్పుడు కలెక్టర్ పోస్టు కంటే ఐటీ ఉద్యోగానికే డిమాండ్ ఎక్కువగా ఉంది. విట్ అమరావతిలో 95 శాతం ప్లేస్‌మెంట్లు వస్తున్నాయి. మీరు ఉద్యోగంలో సంతృప్తి చెందవద్దు.. కొత్త సంస్థలు స్థాపించండి. సిలికాన్ వ్యాలీలో కంపెనీల సీఈవోలంతా తెలుగోళ్లు, భారతీయులే. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉంటారు. అందులో అగ్రస్థానంలో ...(మిగతా 2లో)

## పర్యాటకుల ప్రాణాలు కాపాడలేకపోయాం

- కాశ్మీర్ అసెంబ్లీలో సిఎం ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యలు
- మృతులకు ఘనంగా నివాళి అర్పించిన అసెంబ్లీ



**శ్రీనగర్ :** పహల్గామ్ ఉగ్ర దాడిని ఖండిస్తూ జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ తీర్మానం చేసింది. మృతులకు ఘనంగా నివాళి అర్పించింది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆసక్తికర ప్రసంగం చేశారు. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత దేశంలోని ప్రతి ప్రాంతం ఆవేదనకు గురైందన్నారు. ఉత్తరం నుంచి దక్షిణం వరకు.. తూర్పు నుంచి పడమర వరకు ఇలా ప్రతి ప్రాంతం దిగ్భ్రాంతికి గురైందని గుర్తుచేశారు. ఉగ్ర దాడి తర్వాత కాశ్మీర్ అంతా ఐక్యంగా ఉందని గుర్తుచేశారు. ఇక లోయలో ఉగ్రవాదం అంతం కావడం ఖాయమన్నారు. ఇక ఉగ్ర దాడిలో చనిపోయిన 26 మంది పేర్లను సభలో చదివి వినిపించారు. ఈ దాడిలో తండ్రులను కోల్పోయిన ...(మిగతా 2లో)

## చెత్త సేకరణకు అధిక ప్రాధాన్యం : మంత్రి నారాయణ



**విజయవాడ :** చెత్త సేకరణకు మున్సిపల్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి నారాయణ తెలిపారు. సోమవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో కెపాసిటీ- బిల్డింగ్, బిహేవియరల్ చేంజ్‌పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్ షాప్‌నకు మంత్రి నారాయణ, కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ ...(మిగతా 2లో)

## ఐదేళ్లు వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిన వైకాపా: నిమ్మల



**ఏలూరు (విశాఖ సమాచారమ్ ) :** ఏపీలో ఐదేళ్లపాటు వ్యవసాయ రంగాన్ని మూతవేసిన వైసీపీ వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. సోమవారం పాలకొల్లు మండలం లంకల కోడేరు, వెంకటాపురం గ్రామాల్లో కాలవగట్లను రహదారులుగా మార్చే పనులకు మంత్రి నిమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో ...(మిగతా 2లో)

## తిరుపతి జిల్లాలో ఘోరరోడ్డు ప్రమాదం

### ఘటనా స్థలంలో ఐదుగురు దుర్మరణం

**తిరుపతి (విశాఖ సమాచారమ్) :** ఆంధ్రప్రదేశ్‌లో మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.. తిరుపతిలో జిల్లాలో జరిగిన ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఐదుగురు మృతిచెందారు.. ఈ ఘటనలో మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి.. పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై పాకాల మండలం తోటపల్లి దగ్గర ఘోరు ప్రమాదం చోటు చేసుకుంది.. కం-టైనర్ వాహనం కిందకు దూసుకెళ్లింది కారు.. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు.. ప్రమాదంలో మరో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా.. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.. మృతుల్లో ...(మిగతా 2లో)

## తిరుమలలో చెప్పుల తిప్పలకు చెక్

### ర్యాక్ నంబర్ ఆధారంగా చెప్పులు భద్రం

### టిటిడి అదనపు ఇవో వెంకయ్య చౌదరి

**తిరుమల, ప్రజాదర్బార్ :** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్ళే భక్తులు ఎవరూ చెప్పులు ధరించరు. తిరు మాఢ వీధులలో కూడా భక్తులు చెప్పులు వేసుకుని నడవరు. శ్రీవారి ఆలయ పరిసరాలు, అన్నదానం ప్రాంతాలను భక్తులు అంత పవిత్రంగా భావిస్తారు. దీంతో తిరుమల వచ్చిన భక్తులకు చెప్పులు ఎక్కడ వదలాలి అన్నది పెద్ద టాస్క్ అని చెప్పాలి. అందుకోసం తిరుమలలోని పలు రద్దీ ప్రాంతాలలో టీటీడీ చెప్పుల స్టాండ్లు ఏర్పాటు చేసింది. రాంబగీచా, అన్నదానం, ఏటీసీ సర్కిల్, కళ్యాణకట్ట తదితర ప్రాంతాలలో చెప్పుల స్టాండ్?లు ఉన్నాయి. అయినా ...(మిగతా 2లో)

## విశాఖ మహా నగరపాలక మేయర్‌గా పీలా శ్రీనివాసరావు





**విశాఖ, (విశాఖ సమాచారమ్) :** విశాఖ మహానగర పాలక మేయర్‌గా పీలా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. జీవీఎంసీ పాలకవర్గ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి.. కార్పొరేటర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు హాజరయ్యారు. జీవీఎంసీ మేయర్‌గా కూటమి అభ్యర్థి, తెదేపా కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ఎన్నికైనట్లు జాయింట్ కలెక్టర్ ప్రకటించి.. ఆయనకు ధ్రువపత్రం అందజేశారు. మహా విశాఖ నగర పాలక సంస్థకు 2021లో ఎన్నికలు జరిగినప్పుడు తెదేపా అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావు పేరును అధిష్ఠానం ప్రకటించింది. అప్పట్లో మెజార్టీ లేకపోవడంతో 'పీలా'కు పదవి దక్కలేదు. నాలుగేళ్ల పాటు పార్టీ బలోపేతానికి చేసిన కృషితో పాటు, వైకాపా ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడిన పీలా శ్రీనివాసరావుకు పార్టీ అధిష్ఠానం మరోసారి అవకాశం కల్పించింది.

**గుంటూరు మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర..**

గుంటూరు నగరపాలక సంస్థ మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర ఎన్నికయ్యారు. కూటమి బలపరిచిన రవీంద్రకు 34, వైకాపా మద్దతిచ్చిన వెంకటరెడ్డికి ...(మిగతా 2లో)

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

- అర్జీలు పునరావృతం అయితే అధికారులే పూర్తి బాధ్యత వహించాలి
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో 252 విజ్ఞప్తులు
- చందనోత్సవంలో సాధారణ భక్తులకు దర్శనాలలో ఎటువంటి ఇబ్బందులు రాకూడదు
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం (విశాఖ సమాచారమ్) :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్"లో వచ్చిన అర్జీలను అత్యంత ప్రాధాన్యతో పరిష్కారానికి అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి వారితో స్వయంగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు.. జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, ...(మిగతా 2లో)



## భారత్ కన్నెర్ర.. వాడిపోయిన గ్రీన్ పాకిస్థాన్

**పాకిస్థాన్ :** కొండ నాలుక్కి మందేస్తే.. ఉన్న నాలుక ఊడిందన్నట్లుంది పాక్ పరిస్థితి. ఓ ఎడారిని సస్యశ్యామలం చేద్దామని మొదలుపెట్టిన ప్రాజెక్టు ఇప్పుడు పట్టాలు తప్పింది. భారత్‌ను వేధించాలని చేసిన ఓ పని బెడిసికొట్టి.. అసలు పాకిస్థానే ఎడారిగా మారే పరిస్థితి ఏర్పడింది. దాదాపు రెండేళ్ల క్రితం పాకిస్థాన్ ఆర్మీచీఫ్ ఆసీమ్ మునీర్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లు చోలిస్థాన్ ఎడారిలో 'గ్రీన్ పాకిస్థాన్ ఇనీషియేటీవ్' (జీపీఐ) ప్రాజెక్టును ఆర్భాటంగా ప్రారంభించారు. దీనికి సుమారు 3.3 బిలియన్ డాలర్ల బడ్జెట్‌ను సిద్ధం చేశారు. దీని ప్రకారం చోలిస్థాన్ కెనాల్ ప్రాజెక్టు చేపట్టి.. సింధూ ప్రవాహ నీటిని ఎడారిలోకి మళ్లించేలా ఆరు కాల్వలు నిర్మించాలన్నది లక్ష్యం. దీంతో దాదాపు ...(మిగతా 2లో)

## పహల్గాం దాడి.. ప్రధాని మోదీతో రాజ్‌నాథ్ కీలక భేటీ

### ప్రధాని మోదీతో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ

### పహల్గాంలో భద్రతా చర్యలను వివరించారు



**దిల్లీ:** పహల్గాం దాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాదికి గుణపాఠం చెప్పేందుకు న్యూదిల్లీ సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. పహల్గాం దాడి నేపథ్యంలో భారత్ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్‌తో రాజ్‌నాథ్ ఆదివారం భేటీ అయ్యారు. ఆ సమావేశంలో మన సైన్యం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ...(మిగతా 2లో)

## రూట్ మార్చి, వీసాలు ఇచ్చి.. కశ్మీర్‌లో కల్లోలం సృష్టిస్తోన్న పాక్..?



**పాకిస్థాన్ :** పహల్గాం ఉగ్ర దాడితో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి ఈ తరుణంలో ఒక కీలక విషయం వెలుగులోకి వచ్చింది. తన దేశంలో అభివృద్ధిని గాలికొదిలేసిన దాయాది దేశం.. కశ్మీర్‌లో కల్లోలం సృష్టించేందుకు మాత్రం కొత్త కుయుక్తులు పన్నుతూనే ఉంది. భారత్‌లోకి చొరబడినవారిలో ఆదిల్ హుస్సేన్ థోకర్ ఒకడు. అతివాద భావజాలానికి ప్రేరేపితుడై.. చదువు పేరుతో పొరుగుదేశం వెళ్లి ఉగ్రవాద శిక్షణ తీసుకున్నాడు. తిరిగొచ్చి పహల్గాంలో పర్యాటకుల ప్రాణాలు తీశాడు. పహల్గాం లో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో ...(మిగతా 2లో)

# భారత్ కన్నెర్ర.. వాడిపోయిన గ్రీన్ పాకిస్థాన్

(మొదటి పేజీ తరువాయి)

12 లక్షల ఎకరాల సాగుభూమిని అందుబాటులోకి తీసుకురావాలని ఆశించారు. ముఖ్యంగా దక్షిణ పంజాబ్ (పాక్‌లోని) అదనపు భూమిని కూడా సాగు చేయాలని భావించారు.

**రగిలిపోతున్న సింధ్ ప్రజలు..**

ఈ ప్రాజెక్టును ప్రకటించగానే.. పాకిస్థాన్‌లో సింధూ రాష్ట్రంలో అలజడి రేగింది. ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. డిసెంబర్ 18వ తేదీన సింధ్ తరాఖీ పసంద్ పార్టీ భారీ సమ్మెను నిర్వహించింది. భౌగోళికంగా సింధూ జలాలు తొలుత పంజాబ్‌లోకి ప్రవేశించి.. ఆ తర్వాత సింధ్ ప్రాంతానికి చేరతాయి. ఈక్రమంలో పంజాబ్‌లోనే అత్యధికంగా నీళ్లు వాడేసుకొని.. దిగువకు అసలు వదలడం లేదన్నది వారి ఫిర్యాదు.

1970 వరకు ఈ రాష్ట్రానికి సింధూ జలాల్లో 70శాతం యాజమాన్య హక్కు ఉండేది. కానీ, 1991లో దానిని 40శాతానికి కుదించేసి.. పంజాబ్‌కు పంచారు. 1999-2023 వరకు సింధ్ 40శాతం కొరత ఎదుర్కోగా.. పంజాబ్ కేవలం 15శాతం మాత్రమే చవిచూసింది. నీటి పంపిణీలో తమకు అన్యాయం జరిగిందని సింధ్ ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ జారిఫ్ ఖెరో ఓ పత్రిక వద్ద వాపోయారు. ఇక 2024 ఏప్రిల్-మే మధ్య రాష్ట్రానికి 4.645 మిలియన్ ఎకర్ ఫీట్ నీటిని కేటాయించగా.. కేవలం 3.560 మిలియన్ ఎకర్ ఫీట్ నీటిని మాత్రమే వాడుకోగలిగింది. దీనిలో కూడా 23 శాతం అందలేదు. ప్రస్తుతం సింధ్‌లో 82 లక్షల ఎకరాలు మాత్రమే సాగుచేస్తుండగా.. ఇంకా 1.8 కోట్ల ఎకరాలకు నీరు సరిపోవడం లేదు. అదే పంజాబ్‌లో 3 కోట్ల ఎకరాలు సాగులో ఉన్నాయి. ఇక చోలిస్థాన్ కెనాల్ ప్రాజెక్టు వస్తే.. సింధ్ గొంతు ఎండటం ఖాయం. దీనివల్ల మరో 1.2 కోట్ల ఎకరాలు తీవ్రంగా దెబ్బతింటాయి. పాక్ పంజాబ్‌లో మాత్రం 12 లక్షల ఎకరాలు అదనంగా సాగులోకి వస్తాయి.

**కీలెరిగి వాతపెట్టిన భారత్..!**

ఎన్ని యుద్ధాలు, ఉగ్ర దాడులు చేసినా భారత్ సింధూ జలాలను ఆపలేదన్న ధీమా పాక్‌లో బలంగా ఉంది. దీంతో తాజాగా పహల్గాం దాడికి పాల్పడింది. దీనిని తీవ్రంగా పరిగణించిన న్యూఢిల్లీ.. పాక్ బలహీనత చూసి దెబ్బకొట్టింది. దీంతో సింధ్ రాష్ట్రంలో మరింత ఆందోళనలు మొదలయ్యాయి. భారత్ నీరు ఇవ్వక.. వచ్చే జలాలను పంజాబ్‌కు రానీయకపోతే తమ పరిస్థితి ఏమిటన్నది వారి ప్రధాన ఆందోళన. భారత్ నిర్ణయం షరీఫ్‌ల పీఎంఎల్ ఎన్, భుట్టోల పీపీపీ పార్టీల మధ్య వివాదాలకు కూడా కారణమవుతోంది. దీంతో ఇరువురు నేతలు కలిసి చోలిస్థాన్ ప్రాజెక్టును రద్దు చేయాలని నిర్ణయించారు. ఫలితంగా గ్రీన్ పాకిస్థాన్ ఒడలిపోయింది.

# రూట్ మార్చి, వీసాలు ఇచ్చి.. కశ్మీర్‌లో కల్లోలం సృష్టిస్తోన్న పాక్..?

(మొదటి పేజీ తరువాయి)

భారత్, పాక్‌ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది.

# పహల్గాం దాడి.. ప్రధాని మోదీతో రాజ్‌నాథ్ కీలక భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఆ వివరాలను రక్షణమంత్రి నేడు ప్రధానికి వివరించారు. మోదీతో భేటీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్ కూడా పాల్గొన్నారు.

**మధ్యాహ్నం మరో కీలక భేటీ..**

మరోవైపు, రక్షణ వ్యవహారాలపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కూడా సోమవారం భేటీ అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. పార్లమెంట్ హౌస్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ఈ భేటీ జరగనున్నట్లు అధికారిక వర్గాల సమాచారం.

**పాక్‌కు తుర్కియే సైనిక విమానాలు..**

ఇదిలాఉండగా.. పహల్గాం దాడితో సరిహద్దుల్లో అలజడి వాతావరణం నెలకొంది. భారత్ వైపు నుంచి దాడి ఉండొచ్చన్న అంచనాలతో పాక్ ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే సరిహద్దుల్లో అదనపు బలగాలను మోహరించినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా తుర్కియేకు చెందిన పలు సీ-130 హెర్క్యులస్ విమానాలు పాక్‌లో ల్యాండ్ అయ్యాయి. ఈ విమానాల్లో సైన్యానికి అవసరమైన కార్గోను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.

# తిరుమలలో చెప్పల తిప్పలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

తిరుమలలో చాలా ప్రాంతాలలో చెప్పులు కుప్పలు కుప్పలుగా కనిపిస్తుంటాయి. చెప్పుల స్టాండ్లు చూస్తే అదో పద్మవ్యూహాన్ని తలపిస్తుందని చెప్పడంలో అతిశయోక్తి కాదేమో. అక్కడ చెప్పులు వదలడమేగాని తిరిగి వాటిని మనం కనుక్కోవడం అసాధ్యం. దీంతో.. ఈ చెప్పుల సమస్యపై టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి దృష్టి సారించారు. చెప్పుల సమస్యకు శాశ్వత పరిష్కారం ఆలోచించారు. ప్రస్తుతం టీటీడీ ఉచిత లగేజి కౌంటర్‌లో ఉపయోగించే ఆర్‌ఎఫ్ఐడి సిస్టం అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఏటీసీ సర్కిల్‌లో ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. కౌంటర్ పనితీరును అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తుల చెప్పులు వదిలి వెళ్లేటప్పుడు వారి ఫోటోతోపాటు మొబైల్ నెంబర్ ఫీడ్ చేసి స్లిప్ ఇస్తారు. చెప్పులను ఆర్‌ఎఫ్ఐడి ఉన్న బ్యాగ్ లో వేసి ర్యాక్ నెంబర్ ఆధారంగా స్కాన్ చేసి భద్రపరుస్తారు. భక్తులు దర్శనం అయ్యాక తిరిగి వచ్చి స్లిప్ చూపిస్తే స్కాన్ చేసి కౌంటర్‌లో, ఏ వరుసలో ఏ ర్యాక్‌లో ఆనంబర్ గల చెప్పులు ఉన్నాయో ఈజీగా గుర్తించి భక్తులకు తిరిగి అందిస్తున్నారు సిబ్బంది. అటు భక్తులను, ఇటు టీటీడీ సిబ్బంది నుంచి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. 98 శాతం మంది భక్తులు తమ చెప్పులను తిరిగి తీసుకువెళుతున్నామని చెప్పారు. దీంతో నూతన విధానం విజయవంతంగా అమలవుతోందని, మరో నాలుగు ప్రాంతాలలో ఇదే తరహాలో చెప్పుల కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి తెలిపారు.

# విశాఖను ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం: చంద్రబాబు

**అమరావతి:** అమరావతి అందరిదని.. రాష్ట్రానికి ఆత్మ వంటిదని సీఎం చంద్రబాబు అన్నారు. కూటమి నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాజధాని పునఃనిర్మాణ పనులతో అభివృద్ధికి మళ్లీ ఊపిరి లభించిందన్నారు. సభకు తరలివచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకూడదని చెప్పారు. అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించే వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజధానిలో రైతులను భాగస్వాములను చేస్తున్నట్లు చంద్రబాబు వివరించారు. "ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకొని వ్యతిరేక శక్తుల కుట్రలు తిప్పికొట్టాలి. త్వరలోనే 42 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుడతాం. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కూడా




చేపడతాం. విశాఖను ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం" అని చంద్రబాబు తెలిపారు.

# ఆరు ప్రభుత్వ వైద్య కళాశాలలకు కొత్త ప్రిన్సిపాళ్లు




**అమరావతి:** ఆరు ప్రభుత్వ వైద్య కళాశాలలకు కొత్త ప్రిన్సిపాళ్లను, ఐదు బోధనాస్పత్రులకు కొత్త సూపరింటెండెంట్లను నియమించినట్టు వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయం ఆదివారం ప్రకటించింది. వైజాగ్ ఆంధ్ర, కాకినాడ రంగరాయ, రాజమండ్రి, కడప, నెల్లూరు, తిరుపతి శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాలలకు ప్రిన్సిపాళ్లను నియమించారు. డీఎంఈ డాక్టర్ నరసింహాన్ని కాకినాడ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతల నుంచి తప్పించారు. అదే విధంగా వివిధ కళాశాలల్లో ప్రొఫెసర్‌లుగా పనిచేస్తున్న వారిని ఒంగోలు, శ్రీకాకుళం, విజయవాడ, తిరుపతి రుయా, విశాఖ కేజీహెచ్‌లకు నూతన సూపరింటెండెంట్‌లుగా బదిలీ చేశారు.

# సిలికాన్ వ్యాలీలో కంపెనీల సిఈవోలు అంతా తెలుగోళ్లు, భారతీయులే

(మొదటి పేజీ తరువాయి)

తెలుగువారు ఉంటారు. త్వరలో అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నాం. మన పిల్లలు ప్రపంచస్థాయి సేవలు అందించే స్థాయికి ఎదగాలి. వాట్సప్ సేవ ద్వారా ప్రజలకు పరిపాలన, ప్రభుత్వ సర్వీసులు దగ్గర చేశాం. వాట్సప్ ద్వారా వెయ్యి రకాల సేవలు అందిస్తున్నాం. స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047కి మార్గసూచి రూపొందిస్తున్నాం. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగింది. త్వరలోనే అగ్రగామిగా నిలబడుతుంది. ఉగ్రదాడులు భారత్‌ను ఏమీ చేయలేవు. వారికి తగిన బుద్ధి చెబుతాం. సంఘటితంగా ఉండి దేశాన్ని రక్షించుకునే శక్తి మనకుంది.

**అమరావతిలో 5 లక్షల మంది విద్యార్థులు చదవాలి**

డ్రోన్ సేవలను అందుబాటులోకి తెస్తున్నాం. ప్రభుత్వ సేవలను ఒకే తాటిమీదకి తెస్తున్నాం. రియల్ టైం డేటాతో సమస్యలకు రియల్ టైం పరిష్కారాలు చూపిస్తున్నాం. పీ4 ద్వారా పేదరికం లేని సమాజం కోసం కృషి చేస్తున్నాం. 20శాతం సంపన్నులు 20శాతం పేదవారిని పైకి తీసుకురావాలి. ఒకప్పుడు జన్మభూమి కోసం చాలా మంది అలా పని చేశారు. ఇప్పుడు మార్గదర్శి, బంగారు కుటుంబం కోసం కలిసి రావాలి. కొత్తగా ఆలోచించడం ద్వారా యువత విజయం సాధించాలి. ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీగా తయారు చేయాలి. అమరావతిలో 5 లక్షల మంది విద్యార్థులు చదవాలి. విట్‌లో 50 వేల మంది విద్యార్థులు ఉండాలి. కేవలం ఏపీ విద్యార్థులే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల విద్యార్థులు ఉండాలి. అమరావతిలో 30శాతం పచ్చదనం, నీరుతో నిండి ఉంటుంది. ఇప్పుడున్న వర్సిటీలతోపాటు మరికొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థలు వస్తున్నాయి. మే 2న ప్రధానమంత్రి మోదీ అమరావతికి వస్తున్నారు. ప్రధాని చేతుల మీదుగా అమరావతి పునఃప్రారంభం కాబోతోంది" అని చంద్రబాబు అన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

(మొదటి పేజీ తరువాయి)

భీమిలి రెవెన్యూ డివిజనల్ అధికారి సంగీత్ మహాదూర్, జి వి ఎమ్ సి సిటీ ప్లానింగ్ అధికారి ధనుంజయ రెడ్డి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి విచ్చేసిన అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అర్జీదారుని దరఖాస్తు ముగింపు చేసే ముందు జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని, అందువల్ల అర్జీలు పునరావృతం కాకుండా ఉంటాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.

**అధికారులతో పి జి ఆర్ ఎస్ నిర్వహణపై సమీక్ష సమావేశం...**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో జిల్లాకలెక్టర్ పిజిఆర్ఎస్ నిర్వహణ మరియు చందనోత్సవ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ నకు అత్యంత ప్రాధాన్యత నిస్తుందన్నారు. సీఎంఓ కార్యాలయం, డిప్యూటీ సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపడంలో జిల్లాస్థాయి అధికారులు అత్యంత ప్రాధాన్యతతో తక్షణమే అర్జీదారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ శాఖ మరియు జీవీఎంసీలకు సంబంధించి ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని వచ్చే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు అధికారులు శాఖాపరమైన సమీక్ష నిర్వహించి, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ లో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పరిష్కరించిన అర్జీదారుల వద్దకు వెళ్లి వారి యొక్క ఫీడ్ బ్యాక్ ను సేకరించి మొబైల్ యాప్ ఫీడ్ బ్యాక్ కలెక్షన్ రిపోర్ట్ నందు నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ అదేశించారు. ఎన్రోల్మెంట్ ఆఫ్ ఎంప్లాయిస్ ఇన్ హౌస్ హెల్డ్ సర్వే పెండింగ్ వివరాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**చందనోత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష...**

ఈనెల 30వ తేదీన నిర్వహించబోయే శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి చందనోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ భక్తుల దర్శనాలకు తొలి ప్రాధాన్యతనిస్తామని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి పొరపాట్లకు తావులేని విధంగా చందనోత్సవాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. చందనోత్సవం రోజు తెల్లవారు ఝాము 3.00 గంటలకు ఆలయ వ్యవస్థాప ధర్మకర్త తొలి దర్శనం ప్రారంభమవుతుందన్నారు. 3.30 నుంచి 4.00 గంటల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి పట్టువస్త్రాలు సమర్పిస్తారని, అనంతరం తితిదే వారు పట్టువస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు ఎక్కడికక్కడ తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు ఏర్పాట్లు చేయాలని, చిన్న పిల్లలకు పాలు సమకూర్చాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సింహాచలం



కొండపైన, కొండ దిగున శానిటేషన్ మరియు మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది నియమించడంతోపాటు వారందరికీ విధులు నిర్వహించేందుకు వీలుగా డ్యూటీ పాసులు పంపిణీ చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి కొండపైన ఎనిమిది, కొండ దిగిన ఏడు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, 29 మరియు 30 తేదీలలో నాలుగు షిఫ్టులలో మొత్తం 513 మందిని చందనోత్సవ విధులకు వినియోగించడం జరుగుతుందని, 32 అంబులెన్సును అందుబాటులో ఉంచుతున్నామని, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు 10 స్ట్రక్చర్ లను సమకూర్చడం జరిగిందని, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ మందులను, స్పెషలిస్ట్ డాక్టర్లను అందుబాటులో ఉంచినట్లుగా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లా కలెక్టర్ కు వివరించారు. చందనోత్సవానికి సంబంధించి కొండపైన, దిగువన విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా, విద్యుత్ లోడ్ ఎక్కువైతే ట్రిప్ కాకుండా అన్ని సబ్ స్టేషన్ లను తనిఖీ చేయాలని, పార్కింగ్ ఏరియాలలో లైటింగ్ ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దర్శనానికి వెళ్లే భక్తులకు సంబంధించి క్యూలైన్ల ఏర్పాటు, లడ్డు ప్రసాదము మరియు అన్న ప్రసాదం వెళ్లే భక్తులకు క్యూ లైన్ లకు సంబంధించిన బారికేడ్ల నిర్మాణం, దర్శన అనంతరం భక్తుల బయటకు వచ్చే మార్గం లో బారికేడ్ల నిర్మాణం పూర్తిచేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సులకు సంబంధించి పూర్తి ఫిట్నెస్ ను నిర్ధారించిన బస్సులను మాత్రమే కొండ దిగువు నుంచి కొండపైకి, అదేవిధంగా కొండపై నుంచి కొండ దిగివకి భక్తులను చేరవేసేందుకు వినియోగించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఏదైనా వాహనం బ్రేక్ డౌన్ అయినట్లయితే వెంటనే రిపేరు చేసేందుకు మెకానిక్లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. దర్శన టిక్కెట్లకు సంబంధించి ఆన్లైన్ మరియు ఆఫ్లైన్ ద్వారా టికెట్లు అమ్మకాలు, టికెట్లపై సీరియల్ నెంబర్, స్కానింగ్, క్యూలైన్లు తెలిపే బోర్డులు తదితర ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ప్రైవేట్ వాహనాలకు సంబంధించి పూర్తి ఫిట్నెస్ తో పాటు డ్రైవర్లను కూడా షిఫ్ట్ ల వారీగా ఉండే విధంగా చూడాలని జిల్లా రవాణా శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 252 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 122 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 11, జీవీఎంసీ సంబంధించి 57 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 62 వినతులు వచ్చాయి. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు .

# విశాఖ మేయర్‌గా పీలా శ్రీనివాసరావు

(మొదటి పేజీ తరువాయి)

27 ఓట్లు వచ్చాయి. దీంతో మేయర్‌గా కూటమి అభ్యర్థి గెలిచినట్లు ప్రిసైడింగ్ అధికారి భార్గవ్ తేజ ప్రకటించారు.

**కుప్పం పురపాలిక ఛైర్మన్ పదవి తెదేపా కైవసం..**

కుప్పం పట్టణం: చిత్తూరు జిల్లా కుప్పం పురపాలిక చైర్మన్ ఎన్నికను సోమవారం నిర్వహించారు. ఐదో వార్డు కౌన్సిలర్ సెల్వరాజ్‌ను తెదేపా అభ్యర్థిగా, 9వ వార్డు సభ్యుడు ఎస్ డీ హాఫీజ్‌ను వైకాపా ప్రతిపాదించింది. తెదేపా అభ్యర్థి సెల్వరాజ్‌కు 15 ఓట్లు, వైకాపా అభ్యర్తి హాఫీజ్‌కు 9 ఓట్లు వచ్చాయి. దీంతో సెల్వరాజ్ గెలుపును ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శ్రీనివాసరాజు ధ్రువీకరించారు. దీంతో కుప్పంలో తెదేపా కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కాకినాడ జిల్లా తుని పురపాలక ఛైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పీఠాన్ని తెదేపా దక్కించుకుంది. ఛైర్‌పర్సన్‌గా నార్ల భువన సుందరి.. వైస్ ఛైర్మన్‌గా ఆచంట సురేశ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు వైకాపా కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పదవిని తెదేపా కైవసం చేసుకుంది. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగర పంచాయతీ ఛైర్‌పర్సన్‌గా ఆకుల మల్లీశ్వరి ఎన్నికయ్యారు.

# చెత్త సేకరణకు అధిక ప్రాధాన్యం : మంత్రి నారాయణ

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడారు. మున్సిపాలిటీల్లో సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ తొలగించడం ఎంతో సవాల్‌తో కూడినదని అన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో 6500 టన్నుల సాలిడ్ వేస్ట్ ప్రతి రోజూ వస్తుందని చెప్పారు. ఏరోజు కారోజు ఈ చెత్తనంతా తొలగించాలని అన్నారు. గత జగన్ ప్రభుత్వం 80 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిందని మంత్రి నారాయణ అన్నారు.

# ఐదేళ్లు వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిన వైకాపా: నిమ్మల

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో రైతులను పూర్తిగా విస్మరించిన జగన్‌కు, ఆ పార్టీకి రాజకీయాల్లో ఉండే అర్హత లేదని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతుల రహదారుల కోసం ఒక్క తట్ట కంకర వేయలేదని మండిపడ్డారు. కాల్వల్లో ఒక తట్ట పూడిక మట్టి తీసింది లేదని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రానికి వైసీపీ అవసరం లేదని.. ఆ పార్టీకి ఓట్లు- అడిగి అర్హత లేదని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శలు చేశారు.

# తిరుపతి జిల్లాలో ఘోరరోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు, 9 ఏళ్ల బాలుడు ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు.. అందరూ ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు.. ప్రమాదానికి గురైన వాహనం.. తమిళనాడు రిజిస్ట్రేషన్ నంబర్ కలిగి ఉండడంతో.. మృతులు కూడా ఆ రాష్ట్రానికి చెందినవారిగానే అనుమానిస్తున్నారు..

# పర్యాటకుల ప్రాణాలు కాపాడలేకపోయాం

(మొదటి పేజీ తరువాయి)

పిల్లలకు తాను ఏం సమాధానం చెప్పాలని ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. ప్రభుత్వం బాధ్యతగా పర్యాటకులను ఆహ్వానించింది.. కానీ వారికి భద్రత కల్పించలేకపోయా మన్నారు. క్షమాపణ చెప్పడానికి కూడా మాటలు రావడం లేదని.. తండ్రులను కోల్పోయిన పిల్లలకు గానీ.. భర్తలను కోల్పోయిన వితంతువులకు ఏం సమాధానం చెప్పాలన్నారు. తాము ఏం తప్పు చేశామని వాళ్లంతా అడుగుతున్నారని.. సమాధానం చెప్పలేకపోతున్నామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అతిథులను కాపాడటంలో తాను విఫల మయ్యానని జమ్మూకశ్మీర్‌కు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. కానీ, ఆ 26 మంది ప్రాణాలను అడ్డం పెట్టుకొని తాను రాష్ట్రహోదాను డిమాండ్ చేయబోనని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని జాతి తీవ్ర వేదనల్లో ఉన్నప్పుడు కాకుండా.. మరేదైనా రోజు లేవనెత్తుతానని చెప్పారు. పహల్గాం దాడిపై చర్చించేందుకు అక్కడి అసెంబ్లీ నేడు అత్యవసరంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ ఇలాంటి దాడులు గతంలో చాలా చూశాం. కానీ, బైసరన్‌లో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 21 ఏళ్లలో ఇదే తొలిసారి. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఎలా క్షమాపణలు చెప్పాలో కూడా తెలియడం లేదు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి పంపాల్సిన బాధ్యత మాదే. నేను ఆ పనిచేయలేకపోయాను. క్షమాపణలు చెప్పేందుకు నా వద్ద మాటలు కరవయ్యాయిపహల్గాం ఘటన తర్వాత ఏ ముఖం పెట్టు- కొని రాష్ట్రహోదాను డిమాండ్ చేయాలి. నా రాజకీయాలు అంత చౌకబారువి కాదు. గతంలో రాష్ట్ర హోదా అడిగాము.. భవిష్యత్తులో కూడా అడుగుతాము. కానీ, 26 మంది చనిపోయారు.. ఇప్పుడు రాష్ట్ర హోదా ఇవ్వండి అని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటన్నారు. ప్రజలు మాకు మద్దతు ఇస్తే.. మిలిటెన్సీ, ఉగ్రవాదం అంతమవుతాయి. ఇది దానికి ఆరంభం. ఈ ఉద్యమానికి హాని కలిగించేది ఏదీ మాట్లాడకూడదు, చేయకూడదు. మేము మిలిటెన్సీని తుపాకులతో అదుపు చేయగలం.. కానీ, మాకు ప్రజల మద్దతు అవసరం అని అబ్దుల్లా అసెంబ్లీలో పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, పర్యాటకశాఖ మంత్రిగా వారి కాపాడలేక పోయానన్నారు. ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలోని బైసరన్ లోయలో సేదతీరుతున్న పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపారు. ఈ క్రమంలో వారి మతం అడిగి మరీ ఈ దారుణానికి ఒడిగట్టడం సంచలనంగా మారింది. ప్రభుత్వ చర్యలకు ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ ప్రశంసించారు. అలాగే ఉగ్రవాద దాడిని ఖండించారు. అఖిలపక్ష సమావేశాన్ని పిలిచినందుకు ముఖ్యమంత్రిని, ప్రత్యేక సమావేశాన్ని పిలిచినందుకు అసెంబ్లీ స్పీకర్ అబ్దుల్ రహీం రాథర్‌ను ప్రశంసించారు.

## సినిమా హాల్ జంక్షన్లో కాలువ నిర్మాణానికి శంకుస్థాపన



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** మండల కేంద్రమైన పరవాడ సినిమా హాల్ జుంక్షన్ లో సి.సి కాలువ నిర్మాణానికి సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ పైల శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. పరవాడ ఎంపీటీసీ 2 పరిధిలో గల సి.సి కాలువ నిర్మాణానికి ప్రజా పరిషత్ నిధులు 10 లక్షలు మంజూరు చేసినట్లు పైల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎంపీపీ పైలా వెంకట పద్మ లక్ష్మి కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు, పరవాడ పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, బొద్దపు అయ్యబాబు, రెడ్డి నగేష్, బద్రి, వర్రీ హరి, రొంగలి కన్నబాబు, సతీష్, కర్రీ ఎర్నాయుడు, రెడ్డి ఎర్నాయుడు, ఆడారి జానీ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అదనపు రద్దీని తొలగించడానికి జనరల్ కోచ్‌లను తాత్కాలికంగా పెంచుట

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** వెయిట్‌లిస్ట్ చేయబడిన ప్రయాణీకుల అదనపు రద్దీని తగ్గించడానికి, తూర్పు కోస్ట్ రైల్వే 01.05.2025 నుండి 31.05.2025 వరకు ఈ క్రింది రైళ్లలో అదనపు కోచ్‌లను పెంచాలని నిర్ణయించింది.

1. రైలు నెం. 18526/18525 విశాఖపట్నం - బ్రహ్మపూర్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌కు రెండు (02) జనరల్ క్లాస్ కోచ్‌లు పెంచబడతాయి
2. రైలు నెం. 58528/58527 విశాఖపట్నం - రాయ్‌పూర్ - విశాఖపట్నం ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్‌కు ఒక (01) జనరల్ క్లాస్ కోచ్‌లు పెంచబడతాయి
3. రైలు నెం. 58538/58537 విశాఖపట్నం - కోరాపుట్ - విశాఖపట్నం ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్‌కు ఒక (01) జనరల్ సీటింగ్ కోచ్‌లు పెంచబడతాయి
4. రైలు నెం. 58532/58531 విశాఖపట్నం - బ్రహ్మపూర్ - విశాఖపట్నం ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్‌కు ఒక (01) జనరల్ సీటింగ్ కోచ్‌లు జోడించబడతాయి
5. రైలు నంబర్ 22820/22819 విశాఖపట్నం- భువనేశ్వర్- విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌కు రెండు (02) జనరల్ క్లాస్ కోచ్‌లు జోడించబడతాయి
6. రైలు నంబర్ 18512/18511 విశాఖపట్నం- కోరాపుట్- విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌కు రెండు (02) జనరల్ క్లాస్ కోచ్‌లు జోడించబడతాయి

ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకోవాలని అభ్యర్థించారు.

## జి.మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఢిల్లీ నుంచి ప్రత్యేక బృందం సందర్శన



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** జి మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం నాడు సందర్శించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న వంటి డెలివరీలు వైద్య సిబ్బంది చేస్తున్నటువంటి వైద్య సేవలపై ఆరా తీశారు ఇంకా ఉధృతం చేయాలని ఆదేశించి వెళ్లడమైనది ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ధనుస్ నుంచి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలోఆరోగ్య విస్తరణ అధికారి నడిగట్ల ప్రకాష్ జి.మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

## పేరు మార్పు ప్రకటన

మజ్జి దేవి (భర్త పేరు : నోరి రాజేష్), అను నేను వయస్సు : 43 సంవత్సరములు, నివాసం : ఫ్లాట్ నెంబరు : 108, 2వ అంతస్థు, సిద్ధార్థనగర్, శివశక్తి పబ్లిక్ స్కూల్ ప్రక్కన, వడ్లపూడి, విశాఖపట్నం- 530046, (ఆధార్ నెంబరు : 4510 6367 1550) తెలియజేయునది ఏమనగా

నా వివాహమునకు ముందు నా పేరు మజ్జి దేవి, తండ్రి పేరు : రాజుబాబు మరియు నా విద్యార్హత రికార్డులు మరియు ఆధార్ కార్డు ప్రకారం నమోదై ఉన్నవి.

తదుపరి నాకు శ్రీ నోరి రాజేష్‌తో వివాహమైనది. మరియు నా పేరు నోరి దేవిగా వైవాహిక నామంగా నమోదైనది. ఇదే పేరుతో నేను ఎక్సైడ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ నెంబరు 04521206 తేది : 01-03-2022 జారీ చేయబడిన పాలసీ యందు నమోదు చేయించుకొనియుంటిని.

నేను రెండు ఇంటిపేర్లతోను అనగా మజ్జి దేవి మరియు నోరి దేవి పేర్లతో యుంటిని. పేర్లు రెండే కానీ నేను ఒకరినే.

ఈ సందర్భంగా ఈ ప్రకటన ద్వారా నేను ఎక్సైడ్ లైఫ్ ఇన్సూరెన్స్ అధికారులకు అఫిడవిట్ ద్వారా కూడా తెలియజేయునది ఏమనగా రెండు పేర్లూ నాకు చెందియున్నవి. మరియు ఇది అన్నిసందర్భములకు వర్తించును.

ఇట్లు
మజ్జి దేవి

## వినతులను గడువు లోపలే పరిష్కరించాలి



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్ లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని, ఇంకనూ చూడవలసిన కాలం లో ఎప్పుడు చూసినా సున్నా కనపడాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. వివిధ శాఖల అధికారుల వద్ద చూడకుండా ఉన్న వినతులు వెంటనే చూడాలని ఆదేశించారు. సోమవారం పిజిఅర్ఎస్ లో కలెక్టర్ ప్రజల నుండి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని, అలాగే రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని తెలిపారు. గడువు లోపలే వినతులకు సమాధానాలు పంపాలని ఆదేశించారు.

సోమవారం పిజిఆర్ఎస్ కు 188 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ , జేసి సేతు మాధవన్, డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 188 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 80 వినతులు అందాయి. పంచాయతిశాఖ కు 15 , పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్డిఏకు 30 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 07 , జి ఎస్ డబ్ల్యు కు 06, విద్యా శాఖకు 5, హౌసింగ్ కు 2 అందగా , వైద్య శాఖకు 01, విద్యుత్ శాఖకు 2 అందాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి.

**సమయ పాలన పాటించాలి :**

ప్రభుత్వ కార్యాలయాలకు హాజరయ్యే అధికారులు సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రభుత్వ సమయాలలో కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటు లో ఉండాలని ఆదేశించారు. అనేక మంది కార్యాలయాలకు ఆలస్యంగా వస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10.45 గంటలకు అన్ని కార్యాలయాల హాజరు పట్టీ ని ఫోటో తీసి డి.ఆర్.ఓ కు పెట్టాలని, ఆలస్యం అయిన వారికీ సి.ఎల్ మార్క్ చేయాలనీ సూచించారు.

**వేసవి జాగ్రత్తలు తీసుకోవాలి:**

వేసవి దృష్ట్యా జిల్లాలో ఎక్కడా తాగు నీటి సమస్య తెలేత్తకుండా చూడాలని ఎం.పి.డి.ఓ లకు, ఈ.ఓ.పి.ఆర్.డి లకు కలెక్టర్ ఆదేశించారు. మండల కేంద్రాల్లో చలి వెంద్రాలను ఏర్పాటు చేయాలనీ తహసిల్దార్లకు సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్ లను ఏర్పాటు చేయాలనీ, హీట్ వేవ్స్ పై డైలీ రిపోర్ట్ ఇవ్వాలని తెలిపారు.

## జోన్ల వారీగా పనుల పురోగతి సమీక్ష



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఈ రోజు విఎంఆర్‌డిఎ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సాంకేతిక విభాగపు సమీక్షా సమావేశంలో పాల్గొన్న చైర్మన్ శ్రీ ఎం వి ప్రణవ్ గోపాల్ గారు జోన్ల వారీగా పనుల పురోగతిని అడిగి తెలుసుకుని చీమలపల్లి మరియు ఎండాడ వద్ద సంస్థ నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ల పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి త్వరలోనే ప్రారంభోత్సవం జరిపి అందుబాటులోకి తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా వెంకోజిపాలెంలో పునః నిర్మిస్తున్న కళ్యాణమండపం పనులను కూడా పూర్తి చేసి రాబోయే పెళ్ళిళ్ళ సీజన్ దృష్టిలో పెట్టుకొని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నిర్మాణ పనులు నాణ్యతలో ఎట్టిపరిస్థితుల్లో రాజీ పడవద్దని అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కమీషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్ పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, బలరామరాజు, కార్యనిర్వహక ఇంజినీర్లు, ఉపకార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదవారికి అందుబాటులో ఉంటూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యతే ధ్యేయం

### - నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి అభ్యర్థిగా మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు మేయరుగా ఎంపిక చేసి తనకు కీలక బాధ్యతలను అప్పచెప్పారని నగర మేయర్ గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నగర మేయరుగా బాధ్యతలను స్వీకరించిన అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశం మందిరంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ మా తండ్రిగారైన పీల మహాలక్ష్మి నాయుడు బడుగు బలహీన వర్గాల ప్రజల కొరకు పనిచేసేవారని ఆయన ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అప్పగించిన మేయర్ బాధ్యతలను చిత్త శుద్ధితో నెరవేరుస్తానని, ముఖ్యంగా పేద ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యతను ఇస్తానని, తక్కువ కాలంలో వచ్చిన ఈ పదవిని దాని విలువలను మరింత పెంచుతానని, ప్రతి ఇంటికి తాగునీరు సకాలం లో అందించేందుకు కృషి చేస్తానన్నారు. నగర అభివృద్ధి విషయం లో ఒక ప్రణాళిక ప్రకారం వెళ్తూ ప్రజల ఇబ్బందులను తెలుసుకుని వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు, సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని, పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణ విషయం లో అధిక ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో మహా విశాఖపట్నం నగర పాలక సంస్థకు మేయర్ గా ఎంపిక చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు పురందేశ్వరి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, కు మరియు విశాఖపట్నం లోక్ సభ సభ్యులు, విశాఖ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కూటమి కార్పొరేటర్లకు కృతజ్ఞతలను తెలియజేశారు.

తదుపరి పాత్రికేయుల సమావేశం అనంతరం నగర మేయరు పీలా శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకరు రఘురామ క్రిష్ణం రాజు, మాడుగుల శాసన సభ్యులు బండారు సత్యనారాయణ ను ప్రభుత్వ అతిధి గృహం లో మర్యాద పూర్వకం గా కలసి పుష్పగుచ్ఛాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు.

## "అంబికా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం" ఏర్పాటుకు సన్నాహాలు!

### సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్డాది ఉదయ కుమార్ ప్రకటన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** విశాఖ నగరంలో "అంబికా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం"పేరిట రాష్ట్రస్థాయిలో త్వరలో బ్రాహ్మణ సంఘం ఆవిర్భావం కానున్నది. ఈ మేరకు సంఘం ఏర్పాటుకు సంబంధించిన కార్యకలాపాలు సిద్ధమవుతున్నాయి. ఈ విషయాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షులు,సీనియర్ పాత్రికేయులు, బ్రాహ్మణ బంధు వడ్డాది ఉదయ కుమార్ సోమవారం మీడియాకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి, అదేవిధంగా వారి సమస్యల పరిష్కారానికి ఈ సంఘాన్ని నూతనంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఉదయకుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు,రుణ సదుపాయాలు తదితర అంశాలు ఎప్పటికప్పుడు బ్రాహ్మణులకు తెలియజేయడమే తమ సంఘ ప్రధాన లక్ష్యమని ఉదయకుమార్ తెలియజేశారు. విశాఖ నగరంలో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే యువతకు ఉద్యోగ అవకాశాలు, మహిళలకు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తమ సంఘం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఉదయకుమార్ చెప్పారు.త్వరలోనే సంఘం రాష్ట్ర కార్యవర్గం ప్రకటన, సంఘం లోగో ఆవిష్కరణ ఉంటుందని ఉదయకుమార్ మీడియాకు వివరించారు. సంఘం కార్యక్రమాలు గురించి,సంఘ సభ్యత్వ నమోదు,పూర్తి వివరాలు కోసం 8008129309 సంప్రదించవచ్చని వడ్డాది ఉదయకుమార్ పేర్కొన్నారు.

## ఈ నెల 30 న జాబ్ మేళా

### 8 కంపనీలలో 705 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

### జిల్లా ఉపాధి కల్పనాధికారి అరుణ

**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 30 న ఉదయం 10 గంటలకు మహిళా ప్రాంగణం వద్ద గల ప్రభుత్వ ఐ.టి.ఐ లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి అరుణ ఒక ప్రకటన లో తెలిపారు. భారత్ బయోటెక్ , హీరో మోటో కార్ప్, మెడ్ ప్లస్ ఫార్మసీ , డెక్కన్ ఫైన్ కెమికల్స్, గెలాక్షి హెల్త్ ఇన్సురన్సు తదితర 8 కంపనీలలో 705 ఉద్యోగాలకు ఇంటర్వ్యూ లు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ముందుగా www.ncs.gov.in websiteలో job seeker loginలో నమోదు చేసుకొని తన బయో డేటా ను , రెండు పాస్ ఫోటోలను, తీసుకొని ప్రభుత్వ ఐ.టి.ఐ వద్ద హాజరు కావాలని తెలిపారు.

## బాగా చదవాలి - తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలి

- పదిలో అత్యుత్తమంగా నిలిచిన విద్యార్థులతో కలెక్టర్
- విద్యార్థుల తల్లిదండ్రులకు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ అభినందన



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** విద్యార్థులు తమ దృష్టంతా చదువుపై కేంద్రీకరించి భవిష్యత్తులోనూ మంచి మార్కులతో ఉత్తీర్ణులై తమ తల్లిదండ్రులకు, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆకాంక్షించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతిలో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను జిల్లా కలెక్టర్ డా.అంబేద్కర్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సత్కరించారు. ఇంటర్ తదితర పై తరగతుల్లోనూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, తమను ఎంతో కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులకు రుణపడి వుండాలన్నారు. పలువురు బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ బలంగా ఆరోగ్యంగా వున్నపుడే లక్ష్యాలను సాధించగలుగుతారని చెప్పారు.


తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. వారిని ఉన్నతంగా తీర్చిదిద్దినందుకు అభినందించారు. వారిని శాలువాతో సత్కరించి వారు ఏయే వృత్తుల్లో వున్నదీ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి వారి భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. జిల్లా టాపర్‌గా నిలిచిన గర్భాం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి సంగరెడ్డి వివేక్ తాను కంప్యూటర్ ఇంజనీర్ అవుతానని తెలిపాడు. ఒక విద్యార్థి తాను సివిల్స్ సాధించాలని భావిస్తున్నట్టు చెప్పగా, పలువురు తాము ఇంజనీరింగ్‌లో చేరుతామని వివరించారు. విద్యార్థులకు డా.ఏపిజె అబ్దుల్ కలాం రచించిన ఒక విజేత ఆత్మకథ, డా.బి.వి.పట్టాభిరాం రచించిన కష్టపడి చదవొద్దు - ఇష్టపడి చదవండి పుస్తకాలను బహూకరించారు.

విద్యార్థులు సంగారెడ్డి వివేక్(జెడ్పీ హైస్కూల్, గర్భాం), కొయ్య హరీష్(ఏ.పి. మోడల్ స్కూల్, భోగాపురం), లావేటి మెహర్ రేష్మ(బి.సి.సంక్షేమ గురుకులం), చోడవరపు శివ(బి.సి.సంక్షేమ గురుకులం, కారాడ), పెదిరెడ్ల భాగ్యశ్రీ(జెడ్పీ హైసస్కూల్, కొట్యాడ), శంబంగి కలవల లక్ష్మి(జెడ్పీ హైస్కూల్, పక్కి), తాడేల రేవంత్(జెడ్పీ హైస్కూల్, భైరిపురం), సెనేటి మోహన్(బి.సి.సంక్షేమ గురుకులం, కారాడ), పైల యశోద( జెడ్పీ హైస్కూల్, జిన్నాం)లను సత్కరించారు.

కె.జి.బి.వి.పాఠశాలల్లో 580కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ సత్కరించారు. శతశాతం పైగా ఉత్తీర్ణత సాధించిన జామి, వంగర, గజపతినగరం, ఎల్.కోట కెజిబివి పాఠశాలల ప్రిన్సిపాల్‌లను అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యంనాయుడు, సమగ్రశిక్ష ఏపిసి డా.ఏ.రామారావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

## జన్మించింది పాక్‌లో.. 19 ఏళ్లుగా ధర్మవరంలోనే



**అనంతపురం:** పాకిస్థాన్‌లో పుట్టిన ఓ మహిళ ఇక్కడకు వచ్చి భారతీయుణ్ని పెళ్లి చేసుకుంది. అనుకోని పరిస్థితుల్లో వారి కుమార్తె దాయాది దేశంలో జన్మించింది. ఏడేళ్ల వయసులో ఇక్కడకు వచ్చేసిన ఆ చిన్నారికి ప్రస్తుతం 26 ఏళ్లు. అయినా ఇప్పటికీ పాకిస్థాన్ పౌరురాలిగానే రికార్డుల్లో కొనసాగుతుండటం గమనార్హం. రెండేళ్ల కిందట భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఆమోదం పొందలేదు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన రంశా రఫిక్ కథ ఇది. పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ పౌరులను తిరిగి పంపాలని కేంద్రం ఆదేశించిన నేపథ్యంలో ఆమె వివరాలు బయటకు వచ్చాయి.

**మలుపు తిప్పిన కార్గిల్ యుద్ధం**

కర్ణాటకలోని బళ్లారికి చెందిన మహబూబ్ పీరన్ అనే వ్యక్తి దేశ విభజన సమయంలో పాక్ వెళ్లిపోయారు. అక్కడే ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు జన్మించారు. చిన్న కుమార్తె జీనత్ పీరన్‌ను ధర్మవరంలోని తన చెల్లెలు కుమారుడు రఫిక్ అహ్మద్‌కు ఇచ్చి 1989లో వివాహం చేశారు. ఈ జంటకు మొదట కుమారుడు పుట్టారు. 1998లో జీనత్ రెండోసారి గర్భం దాల్చిన సమయంలో పాకిస్థాన్‌లోని తన తండ్రికి ఆరోగ్యం బాగాలేదని సమాచారం అందింది. దీంతో తండ్రిని చూసేందుకు ఆమె పాక్ వెళ్లారు. అదే సమయంలో కార్గిల్ యుద్ధం మొదలుకావడంతో తిరిగి వచ్చేందుకు పరిస్థితులు అనుకూలించలేదు. గర్భవతిగా ఉన్న జీనత్ పీరన్ పాకిస్థాన్‌లోనే రంశా రఫిక్‌కు జన్మనిచ్చారు. 2005లో జీనత్ పీరన్ ఆమెను తీసుకుని ధర్మవరం వచ్చేశారు.

**పౌరసత్వానికి ఎదురుచూపులు**

పాకిస్థాన్‌లో పుట్టడంతో రంశా రఫిక్‌కు ఆ దేశ పౌరసత్వం వచ్చింది. తర్వాత ధర్మవరం వచ్చి చదువు కొనసాగించినప్పటికీ భారత పౌరసత్వం కోసం ప్రయత్నించలేదు. 2018లో పాక్ పౌరసత్వాన్ని రెన్యూవల్ చేసుకున్నారు. 2028 వరకు అది మనుగడలో ఉంటుంది. 2023లో భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు ఆమోదం వేయలేదు.

## పహల్గామ్ ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ ముస్లిం సోదరుల నిరసనలు




తాళ్లపూడి (విశాఖ సమాచారమ్) : తాళ్లపూడి మండలంలో పహల్గామ్ ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ ముస్లిం సోదరులందరూ నిరసన తెలియజేశారు. పాకిస్తాన్ వాళ్ళు కళ్ళు మూసుకుని చేసినటువంటి దురాగతమైన ఉగ్రవాదానికి, భారత్ లోని ముస్లిం సోదరులైన మాకు ఎటువంటి సంబంధం లేదని ఇప్పటివరకు చాలా విపత్తులు వచ్చినా 1986 గోదావరి ముంచెత్తినా ఎటువంటి పాకిస్తానీయుడు మాకు సహాయం చేయలేదని, భారతదేశంలో కులమతాలు బేధం లేదని ముస్లిం కమ్యూనిటీ పెద్దయిన షేక్ రఫీ తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖసి ఉల్లా భేగామ్, షేక్ సర్దార్, షేక్ కోటి, ఆలీ, షరీఫ్, అన్వర్,ఆరీఫ్,కరీమ్, షేక్ వల్లి తదితర ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్

మంగళవారం 29-4-2025

# స్త్రీ స్వయం శక్తిగా మారాలి

'బాధ్యతాయుతమైన పౌరులందరూ ప్రభుత్వంలో విడదీయరాని భాగం కావడమే ప్రజాస్వామ్యం, జాతి, లింగం, మతంతో నిమిత్తం లేకుండా పాలనా ప్రక్రియలో ప్రజలందరూ పాలుపంచుకోవడమే ప్రజాస్వామ్యానికి పరమార్థం'. అంటే- యావత్ ప్రజానీకం ఆశలు, ఆకాంక్షలు, అభిప్రాయాలన్నీ సర్కారీ నిర్ణయాల్లో ప్రతిఫలించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సిద్ధిస్తుంది. విధాన నిర్ణయాధికార స్థానాల్లో అన్ని వర్గాలకూ చోటు దక్కినప్పుడే ప్రజాతంత్రం పరిపుష్టమయ్యే వీలుంటుంది. ఈ మేరకు చట్టసభల్లో అడుగుపెట్టి, పాలనలో భాగస్వాములు అయ్యేందుకు మన దేశంలో మహిళలకు లభిస్తున్న అవకాశాలెన్ని? ప్రస్తుత లోక్సభ ఎంపీలలో స్త్రీలు 14శాతమైతే, దేశవ్యాప్తంగా ఉన్న అందరి ఎమ్మెల్యేలలో మహిళల సంఖ్య తొమ్మిది శాతమే. ప్రజాప్రాతినిధ్య వ్యవస్థలో లింగ సమానత్వాన్ని సాధించడంకోసం భారతావని ప్రయాణించాల్సిన దూరం ఇంకా చాలా ఉందని ఈ గణాంకాలే సాక్ష్యమిస్తున్నాయి! పరిపాలనలో మహిళలు ప్రధాన భూమిక వహించే చోట జనజీవితాల్లో గుణాత్మక మార్పులు సాకారమవుతున్నాయని, అభివృద్ధి వికేంద్రీకరణ వాస్తవ రూపం దాలుస్తోందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. కానీ, మన దేశంలో జరుగుతున్నదేంటి? ఓటు వేయడానికే తప్ప పాలించడానికి స్త్రీలు పనికిరారనే పితృస్వామిక భావజాలం ఎగదన్నుతోంది. దాంతో మహిళా ప్రజాప్రతినిధులను పక్కనపెట్టి వారి కుటుంబాల్లోని పురుషులే ప్రతిచోటా పెత్తనం చేసే దుస్థితి నెలకొంది. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో ఇది కొట్టొచ్చినట్లు కనపడుతూ, రాజ్యాంగ ఆశయాలను నీరుగారుస్తోంది. స్వీడన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, యూకే, యూఎస్ఏ తదితర దేశాల చట్టసభలకు ఎన్నికైన వారిలో పాతికశాతానికి పైగా మహిళలే. ఆ ప్రజాస్వామ్య సమ్మిళితత్వమే ఆయా దేశాల సౌభాగ్యానికి ఆలంబనవుతోంది. అదే మాదిరిగా భారతావని వికాస యాత్ర సైతం వేగవంతం కావాలంటే- జనాభాలో దాదాపు సగభాగమైన స్త్రీలు స్వీయ శక్తిసామర్థ్యాల మేరకు ఎదుగుతూ, దేశాభివృద్ధిలో తమ వంతు పాత్రను పోషించాలి. కాబట్టి రాజకీయాలే కాదు, అన్ని రంగాల్లో నాయకత్వ స్థానాలను చేరుకోగలిగేలా వారికి వ్యవస్థాగతంగా తగిన ప్రోత్సాహం అందించాలి! స్త్రీలు గడప దాటకూడదనే కాలంచెల్లిన కట్టుబాట్లను చేదించుకుని ఆధునిక మహిళ భిన్న రంగాల్లో తన సత్తాను చాటిచెబుతోంది. దేశవ్యాప్తంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్నవారిలో అమ్మాయిలు, అబ్బాయిలు దాదాపు సరిసమానంగా ఉన్నారని నీతిఆయోగ్ తాజా నివేదికలో వెల్లడించింది. దేశవ్యాప్తంగా మహిళల నేతృత్వంలో పనిచేస్తున్న 66.61 లక్షల ఎంఎస్ఎంఈలు- 4.05 కోట్ల మందికి ఆసరాగా నిలుస్తున్నాయి. ఇవి కాక అసంఘటిత రంగంలో మరో 1.43 కోట్ల సూక్ష్మ పరిశ్రమలు స్త్రీల సారథ్యంలో నడుస్తూ, 1.69 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. లింగ వివక్షను పూర్తిగా అరికట్టగలిగితే భారత జీడీపీకి 70వేల కోట్ల డాలర్లు అదనంగా జతకూడతాయన్నది గత పరిశోధనల సారాంశం. ఆ ప్రగతి ఫలాలను దేశం చవిచూడాలంటే- కుటుంబ స్థాయిలోనే మార్పు కావాలి .ముఖ్యంగా అబ్బాయిలకు మహిళలను గౌరవించడం అలవరచాలి. ఇంటా బయటా లైంగిక వేదింపులకు తావులేని సురక్షిత వాతావరణంలోనే మహిళా సాధికారతా స్వప్నం సాకారమవుతుంది.

# భారత్‌కు పాకిస్తాన్‌కు యుద్ధం వస్తే..!



భారతదేశం , పాకిస్తాన్, రెండు అణ్వస్త్ర శక్తులు కలిగిన పొరుగు దేశాలు. వీటి మధ్యన యుద్ధ సంభవించటం జరిగితే దక్షిణా సియాపై భారీ ఎత్తర ప్రభావం చూపుతుంది. 1947లో బ్రిటిష్ ఇండియా విభజన నుండి ఈ దేశాల మధ్య స్నేహం మరియు శత్రుత్వం యొక్క సంక్లిష్ట చరిత్ర కలిగి ఉంది. ఈ విభజన భారత దేశాన్ని లౌకిక రాజ్యంగా, పాకిస్తాన్ ను ఇస్లామిక్ దేశంగా రూపొం దించింది, జమ్మూ కాశ్మీర్ పై వివాదం తలెత్తడంతో తక్షణ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఈ వివాదం 1947-48, 1965, 1971లో మూడు పెద్ద యుద్ధాలకు మరియు 1999 కార్గిల్ సంఘర్షణకు దారితీసింది. అలాగే, అనేక చిన్న తాకిడులు కూడా జరిగాయి. 1971 యుద్ధం, తూర్పు పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ జన్మించడానికి కారణమై, భారతదేశానికి గణనీయ విజయాన్ని అందించింది. కానీ పరస్పర అవిశ్వాసాన్ని మరింత పెరిగేలా చేసింది. 1972 సిమ్లా ఒప్పందం, కాశ్మీర్లో నియంత్రణ రేఖ(ఎల్ ఓసీ) ని స్థాపించింది. మరియు 1999 లాహెర్ డిక్లరేషన్ ద్వైపాక్షిక చర్చల ద్వారా శాంతిని పెంపొందించే లక్ష్యంతో రూపొందించబడ్డాయి. 1988 అణ్వస్త్ర సౌకర్యాలపై దాడి రహిత ఒప్పందం మరియు 2003 (ఎల్ ఓసీ ) వెంబడి కాల్పుల విరమణ ఉద్రిక్తత తగ్గించే దిశగా అడుగులు వేశాయి. అయితే 2020లో పాకిస్తాన్ 2,729 కాల్పుల విరమణ ఉల్లంఘనలు నమోదు చేసినట్లు నివేదికలు తెలిపాయి. 2019 పుల్వామా దాడి మరియు భారతదేశం బాలాకోట్ గగనతల దాడులు సంబంధాలను మరింతగా దిగజార్చాయి, పాకిస్తాన్ వాణిజ్యాన్ని నిలిపివేసి, 2019లో కాశ్మీర్ స్వయంప్రతిపత్తిని రద్దు చేసిన తర్వాత దౌత్య సంబంధాలను తగ్గించింది. ఈ ఒప్పందాలు, సాంకేతికంగా ముఖ్యమైనవైనవి అయినప్పటికీ, కాశ్మీర్ వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయి, సంబంధాలను అస్థిరంగా ఉంచాయి. సైనిక దృష్టిలో, భారతదేశం స్పష్టమైన ఆధిక్యతను కలిగి ఉంది. దాని సాయుధ దళాలు, ప్రపంచంలో నాల్గవ స్థానంలో ఉండి, 14.5 లక్షల మంది ఉన్నత స్థాయి అధికార సిబ్బంది, సైనికులు 51,37,550, రక్షణ బడ్జెట్ 6.8 లక్షల కోట్లు. 4,201యుద్ధ ట్యాంకులు, 2,229 విమానాలు, ఫైటర్ జెట్స్ 513,మరియు ఏరియల్ ట్యాంకర్స్-6, ఎయిర్క్రాఫ్ట్ క్యారియర్-6, హెలికాప్టర్లు 899, ఐఎన్ఎస్ విక్రమాదిత్యతో సహా నావికాదళాన్ని కలిగి ఉన్నాయి. అలాగే అణ్వస్త్ర క్షిపణులు 180, యుద్ధం నౌకలు 293, జలాంతర్గాములు 18, భారతదేశం యొక్క డాలర్లు 79 బిలియన్ రక్షణ బడ్జెట్ రూ.6.8 లక్షల కోట్లు, పాకిస్తాన్ యొక్క ఆ 11 బిలియన్లను మించిపోతుంది, రాఫెల్ జెట్లు-400 క్షిపణి వ్యవస్థలు మరియు టి-90ఎస్ ట్యాంకుల వంటి అధునాతన ఆయుధాలలో పెట్టుబడులను సాధ్యం చేస్తుంది. పాకిస్తాన్, 53 లక్షల మంది సిబ్బంది, 2,6 ట్యాంకులు మరియు 1,399 విమానాలతో, ఫైటర్ జెట్స్ 328 ప్రపంచంలో 12వ స్థానంలో ఉంది. దాని వైమానిక దళం, చైనాతో కలిసి అభివృద్ధి చేసిన జే.ఎఫ్. -17 జెట్లతో సనమై ఉండే దానికి 12 రక్షణ బడ్జెట్ 2.2. లక్షల కోట్లు. కానీ ఇది తక్కువ స్థాయిలో రక్షణ ఆయుధాలు కలిగి ఉన్నట్లు సమాచారం అందుతుంది. పాకిస్తాన్ నావికాదళం 121 యుద్ధ నౌకలు, జలాంతర్గాములు 08 మాత్రమే కలిగి ఉంది. ఏరియల్ ట్యాంకర్కు సమానమైన క్యారియర్ సామర్థ్యాలను కలిగి లేదు. రెండు దేశాలు అణ్వాయుధ నిలువలను కలిగి ఉన్నాయిభారతదేశం 160-170 వార్హెడ్లతో మరియు పాకిస్తాన్ 170-180 వార్హెడ్లతోసీఏ యుద్ధం యొక్క ప్రమాదాలను పెంచుతుంది. భారతదేశం యొక్క అణు త్రయం (భూమి, సముద్రం, గగనతల డెలివరీ) పాకిస్తాన్ కంటే బలమైనది, ఇది బాలిస్టిక్ క్షిపణులపై ఎక్కువగా ఆధారపడుతుంది. అయితే, పాకిస్తాన్ యొక్క యుద్ధ-పరీక్షిత సైన్యం మరియు అసమాన యుద్ధ వ్యూహాలు, మిలిటెంట్ గ్రూపులకు మద్దతు సహా, కాశ్మీర్ యొక్క కఠిన భూభాగంలో సాంప్రదాయ యుద్ధాన్ని దీర్ఘకాలం కొనసాగించగలవు. ఆర్థికంగా, భారతదేశం యొక్క 4.2 ట్రిలియన్ డాలర్లు జిడిపి పాకిస్తాన్ యొక్క డాలర్లు 374 బిలియన్లను బాగా మించిపోతుంది, యుద్ధం యొక్క ఆర్థిక భారాన్ని భరించడానికి ఎక్కువ స్థితిస్థాపకతను అందిస్తుంది. గత యుద్ధాలు రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలను ఒత్తిడికి గురిచేశాయి. 1971 యుద్ధం భారతదేశానికి సుమారు డాలర్లు 2 బిలియన్ (1971 డాలర్లలో) ఖర్చు అయింది, మరియు పాకిస్తాన్ తన నావికాదళంలో సగం, వైమానిక దళంలో నాలుగో వంతు, మరియు సైన్యంలో మూడో వంతు కోల్పోయింది, తూర్పు పాకిస్తాన్లో ఆర్థిక పతనంతో పాటు. కార్గిల్ సంఘర్షణ పాకిస్తాన్ యొక్క బలహీన ఆర్థిక వ్యవస్థను ఖాళీ చేసింది, 4,000 మంది సైనికులను కోల్పోవడం మరియు అంతర్జాతీయంగా ఒంటరిగా మిగిలిపోవడం ఆధునిక యుద్ధం వినాశకరంగా ఉంటుంది. భారతదేశం యొక్క పెద్ద నిల్వలు దీర్ఘకాల యుద్ధాన్ని కొనసాగించగలవు, కానీ వాణిజ్యం మరియు పెట్టుబడులకు ఆటంకాలు దాని వృద్ధి దిశను దెబ్బతీస్తాయి. ఇప్పటికే ఐఎంఎఫ్ బెయిల్అవుట్లు మరియు బలహీనమైన కరెన్సీతో పాటు గ్రస్తమైన పాకిస్తాన్, ఆర్థిక పతనం ప్రమాదంలో ఉంది, ఒక నెల యుద్ధం కోసం రెండు వైపులా డాలర్లు 50 బిలియన్లకు పైగా ఖర్చు అవుతుంది, ఆయుధాలు, లాజిస్టిక్స్ మరియు మౌలిక సౌకర్యాల నష్టాన్ని కలుపుకొని, చైనా- పాకిస్తాన్ %ఛ% కారిడార్ ద్వారా పాకిస్తాన్ యొక్క చైనీస్ ర ఆధారపడటం లోతుగా మారవచ్చు, గ్వాదర్ ఓడరేవు వంటి వ్యూహాత్మక ఆస్తులను వదులుకోవచ్చు. నైతికంగా, భా తదేశం తన చర్యలను ప్రజాస్వామా కాపాడడం మరియు ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం గా చిత్రీకరిస్తుంది, ఇది పాశ్చాత్య దేశాలతో సంనాదతి. పాకిస్తాన్ యొక్క కాశ్మీరీ స్వయంప్రతిపత్తి మద్దతు కథనం ముస్లిం దేశాలలో సానుభూతిని పొందుతుంది, కానీ లష్కర్-ఎ-తోయిబా వంటి గ్రూపులతో దాని ఆరోపిత సంబంధాలు అంతర్జాతీయ మద్దతును పరిమితం చేస్తాయి. 2025లో కాశ్మీర్లో పర్యాటకులపై జరిగిన దాడి, ఒక మిలిటెంట్ గ్రూపు బాధ్యత వహించడంతో, పాకిస్తాన్ను దౌత్యపరంగా మరింత ఒంటరిగా చేసింది. యుద్ధం యొక్క ఖర్చులు ఆర్థికానికి మించి విస్తరిస్తాయి. అణు యుద్ధం, ఎంత అసంభవమైనా, లక్షల మందిని చంపగలదు మరి యు రెండు దేశాల భాగాలను నివాసయోగ్యం కానివిగా మార్చగ లదు. సాంప్రదాయ యుద్ధం కూడా తీవ్రమవడం, ప్రపంచ శక్తుల ను లాగడం ప్రమాదం ఉంది. భారతదేశం యొక్క సైనిక మరియు ఆర్థిక ఆధిక్యత దీర్ఘకాల యుద్ధంలో విజయం సాధించగలదని సూచిస్తుంది, కానీ పాకిస్తాన్ యొక్క అణు సామర్థ్యం మరియు గెరిల్లా వ్యూహాలు గణనీయ నష్టాన్ని కలిగించగలవు. రెండు దేశాలు సిమ్లా ఒప్పందం మరియు లాహెరీర్ డిక్లరేషన్ వంటి ఒప్పందాలను ఉపయోగించి దౌత్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి, పరస్పర వినాశనాన్ని నివారించడానికి. ప్రపంచం శాంతిని కోరుతూ చూస్తోంది, ఇదే ఏకైక ఆచరణీయ మార్గం.

**- డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**

# మంచికీ చెడుకీ మనమే కారణం

ఆ విమానం ఆఫ్రికా నుంచి వస్తోంది.

లండన్ చేరుకుంది.

అందులోంచి ఓ మహిళను అత్యవసరంగా లండన్ లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

కాస్సేపటికే వైద్య నిపుణులు అక్కడికి చేరుకున్నారు.

ఆ మహిళకు చేయవలసిన అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. ప్రథమ చికిత్స చేసారు. ఆమెకు తదుపరి ఏం చేయాలా అని ఆలోచించారు. ఆమెకు ఏం జబ్బోనని వైద్యులకు బోధ పడలేదు.

ఇలా అయిదు రోజులు గడిచాయి.

ఆరవ రోజు ఆమెలో కొంత తేడా కనిపించింది.

ఆమె తలమీది వెంట్రుకలు రాలిపోవడం మొదలైంది.

అందుకు కారణం తెలీలేదు.

రోజు రోజుకూ ఆమె పరిస్థితి దిగజారుతోంది.

వైద్యులు అయోమయంలో పడ్డారు.

ఆమెను దగ్గరుండి చూసుకుంటున్న నర్సుకి ఓ ఆలోచన వచ్చింది.

తనకనిపించిన విషయాన్ని ఆమె వైద్యులకు చెప్పింది.

ఆమె థాలియం అనే రసాయన మూలకంవల్ల బాధ పడుతున్నట్టు అనిపిస్తోందని చెప్పింది.

డాక్టర్లు ఆమె మాటను సీరియస్ గా తీసుకుని మహిళా రోగిని మళ్ళీ పరీక్షించారు.

కాస్సేపటికి వైద్యులకు నర్సు చెప్పింది నిజమే అనిపించింది.

"ఎలా నీకీ అనుమానం వచ్చింది" అని వైద్యులు ఆమెను అడిగారు.

"అగాథా క్రిస్టీ కారణం" అని ఆమె చెప్పింది.

"ఎవరూ, ఆ ప్రముఖ డిటెక్టివ్ నవలా రచయిత్రి అగాథా క్రిస్టీయా?" అని అడిగారు వైద్యులు.

"అవును, నేను అగాథా క్రిస్టీ అభిమానిని" అని ఆమె అన్నాది.

"అయినా దానికీ దీనికీ ఏమిటి సంబంధం?" అన్నది వైద్యుల ప్రశ్న.

"అగాథా క్రిస్టీ రాసిన పేల్ హార్స్ %జూఖశ్రీవ ష్ట్రశీతీంవ% అనే నవలలో విలన్ థాలియం అనే విష మూలకంతో పలువురిని ఇబ్బంది పెట్టి వేధించాడు. అది ఏ ప్రయోగాలలోనూ బయటపడని ఓ విషం. ఆ విష మూలకంతో బాధ పడ్డ ఓ మనిషి పరిస్థితి గురించి ఆ నవలలో వివరంగా రాశారు. ఈమెను చూస్తుంటే నాకా నవల గుర్తుకొచ్చింది. అది ఇలాటిదే. కనుక ఆ సందేహాన్ని మీతో పంచుకున్నాను" అని ఆమె చెప్పింది.

వైద్యులు ఆ నర్సుని ప్రశంసించారు.

ఆమె మానసికంగా అగాథా క్రిస్టీకి కృతజ్ఞతలు చెప్పారు.

ఓ నవల ఓ రోగిని ఇలా కాపాడింది.

ఇది సంతోషకరమైన విషయమే.

కానీ అదే నవల కొందరి ప్రాణాలను పోగొట్టింది అనేది బాధ కలిగించే విషయం.

లండన్ నగర శివార్లలో ఓ పరిశ్రమ.

అందులో పని చేస్తున్న వారిలో కొందరు క్రమంగా చనిపోతున్నారు.

వారందరూ ఒకే రకం జబ్బుతో చనిపోయారు. అది ఏం జబ్బో ఎవరికీ అర్థం కాలేదు.

వైద్యులు కనిపెట్టలేకపోయారు. అంతుబట్టని ఆ విషయం చాలా కాలం కొనసాగింది. దాంతో పరిశ్రమ యాజమాన్యం ఈ వ్యవహారాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్ళింది.

పోలీసులేమో ఎందుకైనా మంచిదని ఓ డిటెక్టివ్ నిపుణుడిని కలిసి ఈ వ్యవహారాన్ని వివరించారు.

ఆ డిటెక్టివ్ నిపుణుడు ఓ సాధారణ కార్మికుడిలా ఆస్పత్రి ఆవరణలో నడయాడాడు. అక్కడున్న ఓ క్యాంటీన్లో ఓరోజు టీ తాగుతున్నప్పుడు అతనికి ఎదురుగా కూర్చున్న ఓ అయిదుగురు అవీ ఇవీ మాట్లాడుకుంటున్నారు. డిటెక్టివ్ నిపుణుడు తన చెవిని అటువైపు పోనిచ్చాడు. వారి మాటలు వినడం కోసం టీని చాలా నెమ్మదిగా తాగాడు. ఆ అయిదుగురి మాటలు మరణించిన వారి చుట్టూ సాగాయి. వైద్యులు కూడా ఆ వ్యాధి ఏమిటో కనుక్కోలేకపోయారట అని ఒకడంటే బహుశా అదేదో విష ప్రయోగమే అయి ఉండొచ్చని ఇంకొకడు అన్నాడు. ప్రేతపరీక్షలలోనూ విషయం బయట పడలేదన్నాడు మరొకడు. అది ఎటువంటి విషమో కదా అని ఒకడనగా అప్పటి వరకూ మౌనంగా ఉన్న అయిదో వ్యక్తి చెప్పడం మొదలుపెట్టాడు....

"థాలియం అనే విషపదార్థంతో చంపి ఉండొచ్చు" అని చెప్పాడు. ఆ విషప్రయోగాన్ని ఎవరూ అంత సులువుగా కనిపెట్టలేర" న్నాడు.

ఈ మాటలు విన్న డిటెక్టివ్ నిపుణుడు ఆ అయిదో వ్యక్తి రూపాన్ని మనసులో బంధించాడు. వెంటనే డాక్టర్ల వద్దకు వెళ్ళాడు.

ఈ రహస్య మరణాలకు కారణం థాలియం కారణం కావచ్చేమో అని చెప్పాడు.

వైద్యులు సరేనని ఆ దిశలో పరీక్షలు జరపగా విషయం బయటపడింది. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా యిదో వ్యక్తిని పట్టుకుని విచారించారు. అప్పుడు తెలిసింది అతనే ప్రధాన నిందితుడని తేలిపోయింది.

అతను తన వాంగ్మూలం ఇచ్చాడు....

నేను అగాథా క్రిస్టి నవల పేల్ హార్స్ ని చదివాను. థాలియం గురించి తెలుసుకున్నాను. దానిని పరీక్షించాలనుకున్నాను. టీలో కలిపి కొందరికి ఇచ్చాను అన్నాడు.

ఈ రెండు సంఘటనలతో అర్థం చేసుకోవలసింది ఏమిటంటే, ఒకే నవల ఒకవైపు ప్రాణాన్ని కాపాడింది. మరొకవైపు కొందరి ప్రాణాలు తీసింది.

ఏదైనా కావచ్చు, దాన్ని ఉపయోగించడం బట్టీ ఉంటాయి లాభనష్టాలు అనడానికి ఇదొక ఉదాహరణ.

**- యామిజాల జగదీశ్**

# పార్టీ ప్రజలకు మరింత చేరువ కావాలి



పార్టీకి ఒకప్పుడు కంచుకోటలుగా ఉన్న బెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో తీవ్రమైన ఎదురుదెబ్బలు తగలడం, తత్పర్యవసానంగా ప్రజా పునాది బలహీనపడడం జరిగింది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ అఖిల భారత మహాసభ ఏప్రిల్ 6న మదురైలో ముగిసింది. బిజెపి-ఆర్.యస్.యస్ లను ఒంటరిపాటు చేసి ఓడించడమే లక్ష్యమని ఈ మహాసభ రాజకీయ తీర్మానం స్పష్టం చేసింది. గత పదకొండేళ్ళ మోడీ పాలనలో నయా ఫాసిస్టు లక్షణాలు సంతరించుకున్న మితవాద, మతతత్వ, నిరంకుశాధికారం సంఘటిత పడిందని మహాసభ నిర్దిష్టంగా విశ్లేషించింది. హిందూ త్వ శక్తుల, బడా బూర్జువాల చెలిమికి మోడీ ప్రభుత్వం ప్రాతినిధ్యం వహిస్తున్నదని నొక్కివక్కాణించింది. అందుకే బిజెపి-ఆర్.యస్.యస్, కార్పొరేట్-హిందూత్వ అపవిత్ర చెలిమికి వ్యతిరేకంగా పోరాడి ఓడించి తీరడమే ప్రధాన లక్ష్యంగా ప్రకటించింది.

మతతత్వ శక్తుల కార్యకలాపాలకు, దాని సిద్ధాం తానికి వ్యతిరేకంగా నికరంగా, నిరంతరాయంగా పోరా డడం ద్వారా మాత్రమే బిజెపిని, హిందూత్వ శక్తులను ఓడించడం సాధ్యపడుతుందని విస్పష్టంగా ప్రకటిం చింది. హిందూత్వ మతతత్వ ప్రమాదానికి వ్యతిరేకంగా దేశంలోని లౌకిక శక్తులు అన్నింటినీ విశాల ప్రాతిపది కన కూడగట్టడానికి కృషి చేస్తూనే, హిందూత్వ-నయా ఉదారవాద పరిపాలనకు వ్యతిరేకంగా చేసే పోరాటం విజయవంతం కావాలంటే సి.పి.ఐ(యం) స్వతం త్రంగా తన బలాన్ని పెంచుకోవాలని, వామపక్ష శక్తులు మరింత బలోపేతం కావాలని సి.పి.ఐ (యం) భావిస్తున్నది.

గత కొంత కాలంగా పార్టీ, వామపక్ష శక్తుల బలం, ప్రభావశక్తి ప్రతిష్టంభనకు గురికావడం, ఆ పై తగ్గుముఖం పట్టడం ఆందోళనకరంగా మారింది. పార్టీకి ఒకప్పుడు కంచుకోటలుగా ఉన్న బెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో తీవ్రమైన ఎదురుదెబ్బలు తగలడం, తత్పర్యవసానంగా ప్రజా పునాది బలహీనపడడం జరిగింది.

బిజెపికి వ్యతిరేకంగా లౌకిక శక్తులను విశాల ప్రాతిపదికన కూడగట్టడంతో విజయవంతం అయినా 23వ మహాసభలో నిర్దేశించుకున్నట్లు సి.పి.ఐ.(యం), వామపక్ష శక్తులు బలం, రాజకీయ ప్రభావం పెంచు కోవాలన్న లక్ష్యాన్ని సాధించడంలో విఫలమయ్యామని రాజకీయ సమీక్షా నివేదికలో ఆత్మ విమర్శనా పూర్వకంగా పేర్కొన్నది.

23వ అఖిల భారత మహాసభ నిర్దేశించిన రాజకీయ-ఎత్తుగడల పంథా సరైనదే అని పునరుద్ఘాటిస్తూ ఆర్.యస్.యస్ దాని అనుబంధ హిందూత్వ సంస్థల ప్రభావాన్ని, కార్యకలాపాలను తిప్పికొట్టడానికి రాజకీయ, సైద్ధాంతిక, సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక రంగాలలో పార్టీ నికరంగా పోరాటాలు నిర్వహించాలని 24వ మహాసభ పిలుపునిచ్చింది. బిజెపి-ఆర్.యస్.యస్ లను ఒకదాని నుండి మరొకదానిని ఒంటరిపాటు చెయ్యలేమని, కేవలం ఎన్నికల ద్వారా మాత్రమే వీటిని ఓడించడం సాధ్యపడదని సి.పి.ఐ (యం) భావిస్తున్నది. గత దశాబ్దకాలంలో హిందూత్వ శక్తులు సైద్ధాంతికంగా ప్రభావితం చెయ్యగల గణనీయమైన పునాదిని ఏర్పరుచుకోగలిగాయి. కాబట్టి ఈ శక్తులను ఓడించడానికి సమగ్రమైన ప్రణాళిక ఉండాలని పార్టీ భావిస్తున్నది.

ఇందులో భాగంగా కార్మికవర్గంలో, కార్మికవర్గ నివాస ప్రాంతాల్లో, కార్మిక సంఘాల్లో, ప్రజా సంఘాల్లో ఇతరత్రా వేదికల్లో సామాజిక-సాంస్కృతిక కార్యకలా పాల ద్వారా మతతత్వ వ్యతిరేక కషిని పెంపొందిం చడం మీద పార్టీ ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని నిర్ణయిం చుకున్నది. మత విశ్వాసానికి, మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగపరచడానికి మధ్య ఉన్న తేడాను విశ్వాసులకు అర్థం చేయించే కృషిని కూడా చేపడుతుంది. పండుగలు, ఇతర సామూహిక సమావేశాల్లో మతతత్వ శక్తులు జొరబడి రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చెయ్యడాన్ని నిలవరించడానికి కూడా ప్రయత్నిస్తుంది. పండుగలు / తదితర సందర్భాలలో మతాతీత, కులాతీత మేలు కలయికల కోసం కృషి చేస్తుంది. మనువాద ఛాందసవాద విలువలకు వ్యతిరేకంగా లౌకిక, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడానికి ప్రజా సైన్సు ఉద్యమాలలోను సామాజిక సేవా కార్యక్రమాలలోను పాల్గొంటుంది.

బెటంగాల్, త్రిపుర లలో పార్టీని, వామపక్ష శక్తులను పునర్నిర్మించి బలోపేతం చేసుకోవడం అత్యున్నత కర్తవ్యంగా మదురై మహాసభ నిర్దేశించుకున్నది. పశ్చిమ బెంగాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంత పేద ప్రజానీకం మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టి వారిని సంఘటితపరచి నిర్మాణంలో ఇముడ్చు కోవాలి. త్రిపురలో క్షేత్ర స్థాయి నుండి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవాలని, గిరిజనుల ప్రత్యేక సమస్యల మీద దృష్టి పెడుతూనే కష్ట జీవులందరినీ ఐక్యం చేసేందుకు తగిన కార్యాచరణ చేపట్టాలని మహాసభ నిర్దేశించింది.

బెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో ప్రజావిశ్వాసాన్ని తిరిగి చూరగొనడానికి శాయశక్తులా కృషి చేస్తూనే మిగిలిన రాష్ట్రాల్లో పార్టీ ప్రభావాన్ని త్వరితంగా విస్తరింపచేయడానికి కృషి చేపడుతుంది. ఈ కర్తవ్య నిర్వహణలో భాగంగా పార్టీ పునాది వర్గాల్లో కృషిని పెంపొందించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని మహాసభ నొక్కిఒక్కాణించింది. గ్రామీణ ప్రాంత సంపన్న వర్గాల కూటమి దోపిడీకి వ్యతిరేకంగా గ్రామీణ పేదలను ఉద్యమింపచేయడంలో ఎదుర్కొంటున్న బలహీనతలను అధిగమించాలని పార్టీ మహాసభ పిలుపునిచ్చింది. పార్టీ స్వతంత్ర, రాజకీయ కార్యాచరణకు, ప్రజా సమీకరణకు ప్రాధాన్యతనివ్వాలని మదురై మహాసభ స్పష్టం చేసింది. ఎన్నికల అవగాహన, పొత్తుల కారణంగా పార్టీ స్వతంత్ర ఉనికిని గానీ, కార్యాచరణను గానీ పెంపొందించడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మసకబార కూడదని మహాసభ స్పష్టీకరించింది.

కులం, జెండర్ తదితర సామాజిక సమస్యలపై



సంప్రదాయంగా ఆయా ప్రజా సంఘాలు చేస్తున్న కృషి మీదనే ఆధారపడకుండా పార్టీ నేరుగా ఈ ప్రజా సమస్యల్లో జోక్యం చేసుకుని పోరాటాలు పెంపొందించాలని, ఆయా పోరాటాలను దోపిడికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలతో అనుసంధానించాలని గత కొంత కాలంగా సూచిస్తూ ఉన్నది.

పార్టీ బలోపేతం కావాలన్నా, భవిష్యత్తులో మరింతగా విస్తరించాలన్నా యువ తరాన్ని పార్టీ ప్రభావంలోకి మరింతగా తీసుకురాగలగాలి. పార్టీ వైపునకు యువతరాన్ని ఆకర్షించాలంటే బూర్జువా పార్టీలకు భిన్నంగా, వారిని ఆకట్టుకునేలా ఆకర్షణీయమైన నినాదాన్ని, కార్యాచరణను రూపొందించాలని పార్టీ గుర్తించింది. ప్రత్యామ్నాయం కోసం అన్వేషిస్తున్న యువతరం ఆకాంక్షలను అందుకోవాలి. ఇందులో భాగంగా పార్టీ ఎదుర్కొంటున్న బలహీనత ఏమిటో రాజకీయ సమీక్షా నివేదిక స్పష్టం చేసింది.

మన రాజకీయ, సైద్ధాంతిక ప్రచారంలో సోషలిజం సాధనే లక్ష్యంగా పెద్దఎత్తున ప్రచారం కాకపోవడం ఒక బలహీనత. మనం ప్రచారం చేసే వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని సోషలిజంతో అనుసంధానించాలి. సోవియట్ సోషలిస్టు రష్యా పతనానంతరం, సోషలిజానికి ఎదురు దెబ్బలు తగిలిన కాలానంతరం యువతరానికి ఈ లక్ష్యం మరింత చేరువ కావడం అత్యావశ్యకమని ఆ నివేదిక పేర్కొన్నది.

**వ్యాసకర్త : సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ**
**('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)**

పంచాంగం

మంగళవారం 29-4-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, వసంత రుతువు
వైశాఖ మాసం

| | |
|---|---|
| తిథి | : శు. విదియ సా. 5.32 |
| నక్షత్రం | : కృత్తిక సా. 6.47 |
| వర్జ్యం | : ప. 8.12 ల 9.37 |

# మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

2nd pages1.qxd 4/28/2025 7:38 PM Page 5



## మెగా డీఎస్సీ నోటిఫికేషన్ పత్రాలను దగ్ధం చేసిన గిరిజన డీఎస్సీ అభ్యర్థులు

### ప్రత్యేక డీఎస్సీ గిరిజనుల హక్కు మండల కన్వీనర్ యం.నారాయణరాజు



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):–** జి.మాడుగుల మండల కేంద్రంలో ప్రత్యేక డిఎస్సి సాధన కమిటీ మండల కన్వీనర్ మత్స్యరస నారాయణరాజు మాట్లాడుతూ ఇటీవల మెగా డీఎస్సీ ప్రకటించిన నోటిఫికేషన్ లో గిరిజన ప్రాంత అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతంలో వేలాదిమంది ఉపాధ్యాయ పోస్టులకు తల్లిదండ్రులు కష్టార్జితంతో బీఈడీ బీఈడీలు చేసి యున్నారు. నేడు మెగా డీఎస్సీ నోటిఫికేషన్లు గిరిజన ప్రాంత పోస్టులు చూశాక అయోమయానికి గురయ్యారంటూ తెలిపారు. అల్లూరు జిల్లా కేంద్రంగా 501 పోస్టులు ఉండగా అందులో స్థానిక గిరిజన అభ్యర్థులకు 30 పోస్టులు రావడం చాలా బాధాకరమన్నారు. ఇందులో కూడా ప్రమోషన్లు కొన్ని పోస్టులు కేటాయిస్తే 12 పోస్టులు వచ్చే అవకాశం ఉందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. 95% గిరిజన ప్రజలు నివసిస్తున్న షెడ్యూల్ ప్రాంతంలో ఇటువంటి నోటిఫికేషన్ చూసి తీవ్ర ఆందోళనకు లోనవుతున్నారు. ఆదివాసి ప్రత్యేక డీఎస్సీ ఏప్రిల్ 30వ తేదీలోగా ప్రకటించాలన్నారు. ఏజెన్సీలో పోస్టులను మెగా డీఎస్సీలో మినహాయించాలని తెలిపారు. ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన ఇవ్వకపోతే మన్యం బందు సిద్ధమవుతామని తెలియజేశారు. ఈనెల 30వ తేదీన పాడేరు ఐటీడీఏ ముట్టడికి ఆదివాసి ప్రజానీకం సిద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెస కమిటీ మండల అధ్యక్షులు లకే రామకృష్ణ, మాతే వెంకటరమణ, ( సూపర్ సర్పంచ్) ఎంపిటిసి కూడా. చిన్నారావు, మసడి గంగరాజు, వంతల వెంకటరమణ, సిగ్గే కొండలరావు, కురుడే కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మినారాయణ హంతకులను తక్షణమే అరెస్టు చేయాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** కాంగ్రెస్ పార్టీ నేత ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ్ మరియు ఎంఆర్‌పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీ నారాయణ దారుణ హత్యను డా విజయ్ చంద్ర తీవ్రంగా ఖండించారు. చిప్పగిరి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

తన ప్రాణానికి ముప్పు పొంచి ఉంది అని లక్ష్మి నారాయణ తెలియజేసిన కొద్ది రోజుల్లోనే ఆయనను హత్యచేయడం రాష్ట్రంలోని శాంతి భద్రతల పరిస్థితిపై గంభీరమైన ప్రశ్నలు లేవనేత్తుతుంది. ఈ దారుణ ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, రాష్ట్ర డీజీపీ జోక్యం చేసుకొని అనంతపురం ఎస్పీతో, కర్నూలు ఎస్పీతోగారితో మాట్లాడి వెంటనే నిందితులను అరెస్టు చేయాలని విజయ్ చంద్ర కోరారు.

చిప్పగిరి నారాయణ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నుండి పూర్తి మద్దత్తు ఉంటుందని అయన తెలియ జేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని. నిందితులు ఎంత వారైనా తక్షణమే అరెస్టు చేసి శిక్షించి లక్ష్మి నారాయణ కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూడాలని పోలీసు శాఖను డా విజయ్ చంద్ర కోరారు.

## వేంపాడు సబ్ స్టేషన్ లో జగనన్న ఫోటో కి పాలాభిషేకం

## సొమ్మొక్కడిది సోకొకడిది



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):–** గత ప్రభుత్వము లో మంజూరు చేసి పూర్తయిన పవర్ ట్రాన్స్ఫార్మర్ కి టిడిపి నాయకులు తమ హయం లో మంజూరు చేసినట్లు గొప్పలు చెప్పుకుంటో ప్రారంభం చేయడం సిగ్గు చేటు అని వై కా పా నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేంపాడు సబ్ స్టేషన్ లో పవర్ ట్రాన్స్ఫార్మర్ లేక ఇబ్బందులు పడుతున్నామంటూ రైతులు మొర పెట్టుకోవడం తో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ టి టి దీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి దృష్టి కి తీసుకెళ్లి గత వైఎస్ అర్ సిపి ప్రభుత్వ హయం లో కొట్లాదీ రూపాయలు వ్యయం తో ట్రాన్స్ఫార్మర్ 2024 ఫిబ్రవరి నెలలో మంజూరు చేయించారు. ట్రాన్ఫర్మర్ ఏర్పాటు చేసి అధికారులు ఈ ఏడాది ఏప్రయల్ నెలలో కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. దీంతో రైతులకు పగటి పూట తొమ్మిది గంటలు ఉచిత విద్యుత్ వ్యవసాయానికి అందిస్తున్నారు రైతుల సమస్య గత జగనన్న ప్రభుత్వం లోనే పరిష్కారయింది. సబ్ స్టేషన్ కి పవర్ ట్రాన్స్ఫార్మర్ మంజూరు చేసిన గత ముఖ్యమంత్రి జగనన్న ఫోటో సబ్ స్టేషన్ వద్ద పాలాభిషేకం నిర్వహించారు. అలాగే గత ప్రభుత్వం లో మంజూరు అయి పూర్తయిన పనులను టిడిపి నాయకులు తామే మంజూరు చేశామని తప్పు డు ప్రచారం చేస్తూ కొబ్బరి కాయలు కొట్టడం సిగ్గు చేటు అని ఖండిస్తున్నాం అని వారు అన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చి 11 నెలలు గడుస్తున్న ఒక్క అభివృద్ధి పని కూడా మంజూరు చేయలేదు అని, వేంపాడు సబ్ స్టేషన్ లో మూడు కోట్ల తో పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసి రైతులు కష్టాలు తీర్చింది జగనన్న ప్రభుత్వ మే నని ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం లో వైస్ ఎంపిపి లు వీసం నానాజీ, వెలగ ఈశ్వర్ రావు, పి ఏ శి ఎస్ మాజీ అధ్యక్షులు మని రాజు పాపారావు, ఎంపిటిసి తిరుపతి రావ్, గోవిందు, సర్పంచ్ లు భార్గవ్ సురేష్, కొండ సత్తియ్య, సూరిబాబు పాల్గొన్నారు.

# పునర్చరణ, నమూనా పరీక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలి

### పోటీ పరీక్షల అభ్యర్థులకు సివిల్స్ విజేత 'రావాడ' సూచన



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):–** పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పునర్చరణ, నమూనా పరీక్షలు రాయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సివిల్స్ విజేత రావాడ సాయి మోహిని మానస సూచించారు. పోటీ పరీక్షల శిక్షణ కేంద్రంగా ప్రసిద్ధి చెందిన అనకాపల్లి శ్రీ గౌరీ గ్రంథాలయాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షల ఔత్సాహకులను ఉద్దేశించి మానస మాట్లాడుతూ స్వయం శ్రద్ధ, సరైన మార్గదర్శకులు, తల్లిదండ్రుల ప్రేరణ, క్రమంగా చదివితే పోటీ పరీక్షల్లో తప్పనిసరిగా విజయం సాధించవచ్చన్నారు. పరీక్షల్లో సమయ నిర్వహణ– సద్వినియోగం, వేగం కీలకమని, ఇందుకోసం అభ్యర్థి రోజుకు ఒకట్రెండు ఆన్‌లైన్ నమూనా పరీక్షలు రాసి స్వీయవిశ్లేషణ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు పట్టున్న సబ్జెక్టులపైన, బాగా చదివిన అధ్యాయాలపైన పరీక్ష తేదీ చివరి రోజుల్లో దృష్టి సారించాలన్నారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాయాలన్నారు. పోటీ పరీక్షల్లో ఎక్కువ ప్రశ్నలు జ్ఞాపకశక్తి ఆధారితంగానే ఉంటాయన్నారు. సహనం, పట్టుదల, ప్రణాళిక, సమయ సద్వినియోగం పాటించిన పోటీ పరీక్షల అభ్యర్థులు విజేతలుగా నిలుస్తారని అభిప్రాయపడ్డారు. ఆచరణాత్మక అలవాట్లు విఫలమైనప్పుడు స్వీయ విశ్లేషణ అత్యవసరమన్నారు. ఈ విశ్లేషణ పోటీ పరీక్షలకే కాకుండా నిజ జీవితానికి కూడా వర్తిస్తుందన్నారు. నైపుణ్యాన్ని పెంచుకుంటే విజయం ఖచ్చితమన్నారు. భాష కన్నా కంటెంట్ పైన విద్యార్థులు దృష్టి పెట్టాలని సివిల్స్ విజేత మానస అన్నారు. శ్రీ గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాంద్రేగుల వెంకటరమణ అధ్యక్షోపన్యాసం చేస్తూ భవిష్యత్‌లో సివిల్స్‌కు గ్రంథాలయంలో శిక్షణ ఇవ్వడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీ గౌరీ గ్రంథాలయం అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీతలు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, కాంద్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ), మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, కాంద్రేగుల జగ్గారావు, బొడ్డేడ జగ్గఅప్పారావు పాల్గొన్నారు. అనంతరం సివిల్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 975వ ర్యాంకు సాధించిన రావాడ సాయి మోహిని మానసను శ్రీ గౌరీ గ్రంథాలయం ఘనంగా సత్కరించింది.

# పార్టీలకతీతంగా మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలి

### ఏపీ సాంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** పార్టీలకతీతంగా సామాజిక వర్గాల అభివృద్ధికి ఏ పార్టీ అధికారంలోనున్న సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ తద్వార సామాజిక వర్గాల అభివృద్ధికి తోడ్పాడును అందిపుచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ సంప్ర దాయ మత్స్యకార కులాల సంక్షేమ సం ఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి చింతకా యల ముత్యాలు అన్నారు. సమాఖ్య ఆధ్వ ర్యంలో విశాఖ పౌరగ్రంథాలయం సమావేశ మందిరంలో రాష్ట్ర మత్స్యకార ఉపకులాల, ముఖ్యనాయకుల సమావేశము ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర నలు మూలల నుండి సంఘం నాయకుల హాజ రయ్యారు. సమావేశంలో ముత్యాలు మాట్లా డుతూ మత్స్యకార కులాలకు వ్యతిరేకమైన జి.ఓ.నెం. 217 రద్దుచేసినందుకు, మత్స్యకారసేవలో జీవనభృతిని 20 వేల రూపాయలకు పెంచినందుకు, మత్స్య కారులకు అయిల్ సబ్సిడీ, వేట పరికరాలు తదితర అభివృద్ధి. సంక్షేమ పథకాలను అం దిస్తున్నందుకు కూటమి ప్రభుత్వానికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణానికి కృతజ్ఞ తలు తెలిపారు. రానున్నకాలంలో కూడా 14 మత్స్యకార ఉపకులాలకు వారి సం క్షేమం అభివృద్ధికి ఇదే తోడ్పాటును అందిం చాలని ఆశించారు. అదే విధంగా ప్రభు త్వానికి సంఘ సభ్యులు అందరూ బాసటగా నిలవాలని సమావేశంలో తీర్మానం చేశామని తెలిపారు. రాబోవు కాలంలో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం ఇచ్చిన ఎమ్. ఎల్.ఎ.. ఎమ్.పి.. ఎమ్.ఎల్.సి. చైర్మన్లతో సహా రాజకీయ, ఆర్థిక, ఉపాధి, విద్యా రంగాలలో పూర్తి స్థాయిలో కూటమి ప్రభుత్వం సహకారం అందించడానికి, 14 మత్స్యకార ఉపకులాలు ఐక్యతతో ముం దుకు సాగి సాధించుకొనే విధంగా సభ తీర్మాణం చేసిందని వెల్లడించారు. కార్య క్రమంలో రాష్ట్ర అధ్యక్షులు నడకుదిటి ఆర్జున్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, గవ్వల గంగాధర్, ఇతర ప్రజాప్రతినిధులతో పాటుగా రాష్ట్ర నలుమూలలనుండి అధిక సంఖ్యలో మత్స్యకార నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీలను వేయాలని సభలో తీర్మానం జరిగింది.

# ఘనంగా ముగిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి రాష్ట్ర పండగ మహోత్సవాలు

### వేలాదిగా తరలివచ్చిన భక్తులు





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):–** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అయిన అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు నెలరోజులపాటు అత్యంత ఘనంగా జరిగాయి. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కొత్త అమావాస్య, రాష్ట్ర పండగ మహోత్సవాలు ఆదివారం తో ఘనంగా ముగిసాయి. ఆదివారం నెల పండుగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా చుట్టుపక్కల నుండి పట్టణ గ్రామీణ ప్రాంతాలు నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే ఆలయ ఆవరణలో వంటలు వండుకునేందుకు స్థలం లేక చుట్టుపక్కల ఉన్న పొలాలను భక్తులు ఆశ్రయించారు. కుటుంబ సమేతంగా అమ్మవారికి ముక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు గంటలకొద్దీక్యూ లైన్లో నిలుచుని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా ఆవరణ బయట రోడ్లపై కూడా భక్తులు బాలులు తీరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు), ఆలయ సహాయ కమిషనర్ వెంపల రాంబాబు, పండగ ప్రత్యేక అధికారిని కే శోభారాణి, ఆలయ ధర్మకర్తలు సూరేసతీష్, దాడి రవికుమార్ పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు కొడుకుల. శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి ఎర్రవరపు లక్ష్మి , కూటమి నాయకులు, భక్తులు తదిరులు పాల్గొన్నారు.

## మేడగది చర్చిలో ముగిసిన ఆధ్యాత్మిక సభలు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** మేడ గది ప్రార్థన మరియు సౌవార్తిక సహవాసం, ఇసుకతోట వారి ఆధ్వర్యంలో మూడు రోజుల వార్షిక ఉజ్జీవ సభలు ముగిసాయి. చివరి రోజు కార్యక్రమంలో ప్రధాన వక్త పాస్టర్ ఏ. సుకుమార్ పస్కా బలి పశు వు గురించి బైబిలు ప్రవచన గ్రంథమని , బైబిల్ ప్రపంచ క్యాలెండరనీ, పాపము వ్యక్తులకు భ్రమ కలిగిస్తుందనీ, ఆ భ్రమల నుండి మానవుణ్ణి బయట పడవేసే శక్తి బైబిల్ కు వుందని తెలియజేసారు. రెవ.డా.డి.ఇనాక్ దేవుని పరిచర్య లో కలిగే శ్రమలను , వాటిని ఏ విధంగా ఎదుర్కొన వలెనో వివరించారు. సంఘ విశ్వాసులతో పాటు ఇతర గ్రామీణ ప్రాంతాల నుండి క్రైస్తవ సోదరులు హాజరయ్యారు. స్థానిక సంఘ అధ్యక్షులు పాస్టర్.ఎస్.దేవ ప్రసాద్ ఆశీర్వాదంతో సభలు ముగిసాయి. సంఘ పెద్దలు చంద్ర శేఖర్, రమ్య రాజు, పి.రామారావు, ఓ.పీటర్, మాణిక్యం, ప్రేమ్ బాబు ,ఇతర సంఘ పెద్దలు, స్త్రీల సమాజం పాల్గొన్నారు . సండే స్కూల్ బాలలు నృత్యాలను ప్రదర్శించారు. క్వయర్ పార్టీ వారు చక్కటి సంగీతాన్ని అందించారు.

## మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న గెడ్డం బుజ్జి



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):–** సోమవారం ఉద్దండపురం గ్రామంలో వెలిసిన శ్రీ శ్రీ శ్రీ మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవానికి విచ్చేసిన పాయకరావుపేట నియోజకవర్గ ఇన్చార్జి గెడ్డం బుజ్జి కి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ యువకులు, కూటమి పార్టీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పొడగట్ల రమణ, బొల్లం రమణ, అమలకంటి హరికృష్ణ, తుమ్మల శ్యామ్ కిషోర్, పొడగట్ల వీర, పొడగట్ల బుల్లిబాబు, పాలూరి సత్యశ్రీను, కుర్ర అర్జియ్య, వెలగా శ్రీను, బొడ్డా రాజు, పేకేటి చిన్న రాజారావు, తుమ్మల వెంకటరమణ, చంద్రగిరి రమణ, తుమ్మల లక్ష్మణరావు , వెలంశెట్టి శ్రీను, వంగలపూడి రమణ, తుమ్మల గోవిందు ,పొడగట్ల వీరబాబు, కీర్తి గోవిందు, తుమ్మల నానాజీ, కొంతం రమణ, పేకేటి రాము, వెలంకాయల అప్పారావు, కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## డీఎస్సీ - సోషల్ (స్కూల్ అసిస్టెంట్)

### భారతదేశం - భౌగోళిక స్వరూపాలు (10 వ తరగతి)

1. భారతదేశం పూర్తిగా దక్షిణార్ధ గోళంలో ఉంది. దేశం 8°- 50° ఉత్తర రేఖాంశాల మధ్య , 68°-9° తూర్పు అక్షాంశాల మధ్య ఉంది.
2. భారత దేశానికి 82°- 30° తూర్పు రేఖాంశాన్ని ప్రామాణిక రేఖాంశంగా పరిగణిస్తారు . ఇది అలహాబాద్ గుండా పోతుంది . భారతదేశ ప్రామాణిక కాలమానానికి దీనినే ఆధారంగా తీసుకుంటారు . గ్రీన్ విచ్ ప్రామాణిక కాలానికి ఇది 5 1/2 గంటలు ముందు ఉంది.
3. ప్రపంచ భూభాగమంతా అంగార భూమి ( లారేసియా) , గోండ్వానా భూమి అనే రెండు భూఖండాల ద్వారా ఏర్పడింది.
4. భారతదేశ ద్వీపకల్పం గోండ్వానా భూభాగంలో ఉంది. 20 కోట్ల సంవత్సరాల క్రితం గోండ్వానా భూభాగం ముక్కలుగా విడిపోయింది.
5. హిమాలయ పర్వతాలు ముడతపడే ప్రక్రియ వలన ఏర్పడినవి.
6. హిమాలయ పర్వతాలు ఒక చాపం వలే పడమర నుంచి తూర్పుకి 2400 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్నాయి.
7. హిమాలయాలు పశ్చిమ ప్రాంతంలో 500 కిలోమీటర్లు వెడల్పుగా ఉంటాయి . మధ్య, తూర్పు ప్రాంతాల్లో 200 కిలోమీటర్లు వెడల్పుతో ఉంటాయి.
8. హిమాలయాల్లో సమాంతరంగా ఉండే పర్వతశ్రేణులు మూడు ఉన్నాయి.
9. అన్నిటికంటే ఉత్తరాన ఉన్న పర్వత శ్రేణిని ఉన్నత హిమాలయాలు లేదా హిమాద్రి పర్వతాలు అంటారు.
10. హిమాద్రి పర్వతాలు సముద్రమట్టం నుండి 6100 మీటర్లు ఎత్తుగా ఉంటాయి.
11. హిమాద్రికి దక్షిణాన ఉన్న పర్వతశ్రేణిని ' నిమ్న హిమాలయాలు' అంటారు.
12. నిమ్న హిమాలయాల ఎత్తు 3,700 - 4,500 మీటర్ల మధ్య వుంటుంది.
13. పీర్ పంజాల్, మహా భారత పర్వతశ్రేణులు నిమ్న హిమాలయాలలో ముఖ్యమైనవి.
14. నిమ్న హిమాలయ శ్రేణుల్లో ప్రఖ్యాతిగాంచిన కాశ్మీర్ , హిమాచల్ ప్రదేశ్ లోని కంగ్ర, కులు లోయలు ఉన్నాయి.
15. సిమ్లా , ముస్సోరీ , నైనిటాల్ , రాణిఖేత్ వంటి వేసవి విడిది ప్రాంతాలకు , సతత హరితారణ్యాలకు నిమ్న హిమాలయ శ్రేణి ప్రఖ్యాతిగాంచింది.
16. హిమాలయాల్లో దక్షిణాన ఉన్న శివాలిక్ శ్రేణి అంటారు శివాలిక్ శ్రేణి 10- 50 కిలోమీటర్ల వెడల్పులో ఉంటుంది.
17. శివాలిక్ పర్వత శ్రేణులను జమ్మూ ప్రాంతంలో జమ్మూ కొండలని , అరుణాచల్ ప్రదేశ్లో మిష్మి కొండలని , అస్సాంలో కచార్ అని రకరకాల పేర్లతో పిలుస్తారు.
18. నిమ్న హిమాలయ , శివాలిక్ శ్రేణుల మధ్య ఉండే లోయలను స్థానికంగా డూన్ అంటారు. వీటిలో డెహ్రాడూన్ , కోట్లిడూన్ , పాట్లిడూన్ లు ముఖ్యమైనవి.

**– డా.పి.వి.రామ్, ఎం.ఏ, బి.ఈడి, పి.హెచ్.డి**
**విశాఖ సమాచారమ్ 9553574250**

## అవగాహనతోనే ప్రమాదాల నివారణ సాధ్యం



**అనకాపల్లి/రాంబిల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):** అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశాల మేరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లి జిల్లా, రాంబిల్లి మండలం, పంచదార్ల గ్రామపంచాయతీలో విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎస్‌డిఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో 16 మంది సిబ్బంది ఫిజికల్ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వరదలు, తుఫాన్లు వంటి ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు మరియు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు గ్రామాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై గ్రామ ప్రజలకు అవగాహన కలిగే విధంగా పలు రకాల మాక్ డ్రిల్ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు మాక్ డ్రిల్ కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విపత్కర సమయంలో ప్రమాదం నుంచి బయటపడేందుకు దోహదపడతాయని అభిప్రాయం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ అయేషా, నియోజవర్గ ప్రత్యేక అధికారి ఆర్. శిరీష రాణి, ప్రిన్సిపల్ డిపిఆర్సి ఈ. నాగలక్ష్మి, మండల రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో, పోలీస్ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మా గ్రామ సమస్యలు పరిష్కరించండి

### జన సేన మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్యామ్ కిషోర్



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):–** జన సేన, టీడీపీలో అత్యధిక మెజార్టీ తో నక్కపల్లి మండలం లోని ఉద్దండపురం గ్రామ ప్రజలు, ప్రస్తుత హోం మినిస్టర్ నియోజక వర్గం లో ఓట్లు ఎక్కువ వేసి గెలిపించి, పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు ,ఇక్కడ అనిత ఆదేశాలు మేరకు గెలిపించాము అయినా మా గ్రామానికి రోడ్లు విషయం లో శూన్యం మరియు మా గ్రామం అన్ని విషయాల లో శూన్యం, ఎందుకు మా మీద వివక్ష, కొంచెం మా గ్రామం లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని జన సేన మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్యామ్ కిషోర్ ఆవేదన వ్యక్తం చేశారు.

## జిల్లా ఎస్పీ ప్రజా ఫిర్యాదుల వేదికలో 30 ఫిర్యాదులు స్వీకరణ

సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఎస్పీ ఆదేశాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 30 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలు తదితర అంశాలు ఉన్నాయి. ప్రతి సోమవారం నిర్వహించే ఈ వేదికలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా హాజరై, ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వారితో ప్రత్యక్షంగా మాట్లాడారు. ప్రతి ఒక్కరి సమస్యను శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు తక్షణమే విచారణ చేపట్టి చట్టపరమైన పరిష్కారం అందించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా పరిష్కరించడానికి పోలీసు శాఖ కట్టుబడి ఉంది. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటాం," అని ఎస్పీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఎస్.బి ఇన్స్పెక్టర్ టి.లక్ష్మి మరియు ఎస్సై డి.వెంకన్న మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సివిల్స్ లో 975 ర్యాంకు సాధించిన సాయి మోహిని మానసకు సత్కారం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సివిల్స్ లో 975ర్యాంకు సాధించిన కుమారి రావాడా సాయి మోహిని మానస ని ట్రస్ట్ అధ్యక్షురాలు కొణతాల లక్ష్మీపార్వతి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత కొణతాల పణి భూషణ్ శ్రీధర్ ఘనంగా సత్కరించారు. యల్లపు సూరిప్పారావు, పెంటకోట ఉమా మహేశ్వర రావు, మల్ల జగదీష్, శైలజ, కాంద్రేగుల వెంకటరమణ, మైశెట్టి సత్తిబాబు, డాక్టర్ కొణతాల గణేష్, దూదిపల్లి కొండలరావు చౌదరి మరియుట్రస్టు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తాండవ కాలువ పూడిక తీత పనులు ప్రారంభం



**నాతవరం, (విశాఖ సమాచారమ్):-** నాతవరం మండలం వల్సంపేట పంచాయతీ లో తాండవ ఎడమ కాలువ వద్ద పూడికతీత పనులు తాండవ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ "కరక సత్యనారాయణ" కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ తో పాటు నాతవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ,డిసి ప్రెసిడెంట్ లు పారుపల్లి దాసు,మిడతాన ప్రసాద్, మాజీ ఎంపీపీ నేతల విజయ్ కుమార్,మండల వైస్ ప్రెసిడెంట్ జీవిరెడ్డి రాజుబాబు, అనకాపల్లి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు ఇటంశెట్టి సీతారాం,మండల తెలుగుయువత అధ్యక్షుడు శెట్టి లోవ, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు శెట్టి సత్యనారాయణ,గ్రామ పార్టీ ప్రెసిడెంట్ శెట్టి నానాజీ,తాండవ కాలువ డైరెక్టర్లు అల్లు సత్తిబాబు, శివలంక సత్యనారాయణ ,గోర్లి నాయుడు,మాధవనగరం తెలుగుదేశం పార్టీ నాయకులు గంటా శ్రీనివాసరావు ,తానారి శ్రీను గ్రామ నాయకులు మిడతాన వినయ్, టెక్నికల్ అసిస్టెంట్ అప్పారావు మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు కశింకోట గోవింద్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పది తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** పదో తరగతి పరీక్షలు తప్పిన విద్యార్థిని విద్యార్థులకు జిమాడుగుల మండలంలోని మూడు పాఠశాలలో ప్రత్యేక తరగతులు వసతులు ఏర్పాటు చేశారు. జి మాడుగుల మండలంలోని చేసిన జి మాడుగుల గాంధీ నగరం గిరిజన సంక్షేమబాలికల పాఠశాలలో కొక్కిరాపల్లి బంధ వీధి ను ర్మతి పాఠశాలలబాలికలకు. సిహెచ్ స్కూల్లో జి మాడుగుల గేమ్మెలి కుల్లు పాడు పెద్దలోచలి తో పాటు మండలంలో మిగతా పాఠశాల విద్యార్థులకు. ఏపీ గురుకుల పాఠశాలలో జి మాడుగుల తో పాటు సీలేరు పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం ఉదయమే ఆయా పాఠశాలలకు ఉపాధ్యాయులతో పాటు పరీక్షలు తప్పిన విద్యార్థిని విద్యార్థులు విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు వెళ్లి తమ పేర్లను నమోదు చేసుకొని చేరారు. ఈ సందర్భంగా గాంధీనగరం గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుభద్రమ్మ విద్యార్థి ను లను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్ష తప్పిన విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన తరగతులు ప్రత్యేకంగా ఆలకించి సప్లిమెంటరీ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉతీర్ణత కావాలని ఈ సమయంలో ఎటువంటి ఆలోచన లేకుండా చక్కగా చదువు కో వాలని కోరారు. విద్యార్థిని విద్యార్థుల కోసం ఆయా పాఠశాలలో భోజన వసతి సౌకర్యం కల్పించారు.

# వ్యక్తిగత దూషణలు సరైనది కావు




**అరకులోయ, (విశాఖ సమాచారమ్):-** రాజ్యాంగ బద్ధమైన పదవుల లో కొనసాగుతున్న టిడిపి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు వ్యక్తిగతంగా అసభ్యకరమైన పదజాలంతో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పై మీడియా ముందు మాట్లాడటం సరైనది కాదు 900 పేదల గుడిసెలను జెసిబి లతో తొలగించిన సంఘటన స్థలంలో సందర్శించిన సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, పేదల పక్షాన మాట్లాడినందుకు టిడిపి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు వ్యక్తిగత దూషణలు చేయడం సరైనది కాదు రాజ్యాంగం బద్ధమైన పదవులలో ఉన్న వ్యక్తి ఇంత దారుణంగా అసభ్యకరంగా వ్యవహరించడంపై తీవ్రంగా ఖండిస్తున్నాం అధికారం మద్దం ఎక్కి మర్యాద లేకుండా మాట్లాడే వ్యక్తి రాజ్యాంగ బద్ధమైన పదవులు అనుభవించడానికి అర్హులు కారు అటువంటి వ్యక్తి పదవులలో కొనసాగితే సమాజానికి ఇచ్చే సాంకేతమేటని ప్రశ్నిస్తున్నాం, వ్యక్తిగతంగా దూషించిన రఘురామ కృష్ణ రాజు పై టిడిపి పార్టీ అధిష్టానం రఘు రామకృష్ణ రాజు పై చట్టపరమైన చర్యలు తీసుకొని అటువంటి మూరు?లైన ఆలోచనను కట్టిపెట్టాలని ప్రభుత్వానికి కోరుతున్నాం. పేదల గుడిసెలపై దౌర్జన్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం గుడిసెలు నిర్మించి నష్టపోయిన పేదలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు రెండున్నర సెంటు భూములు కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం. పెద్దలును కొమ్ముకాస్తూ పేదల గుడిసెలను బుల్డోజర్లతో తొలగించడం అధికార పార్టీ నాయకులకు అలవాటుగా మారింది పేదలు జీవించే హక్కులపై దాడి జరుగుతుంది .దీని పై అరకు మండల కమిటీ సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది.

ప్రభుత్వం తక్షణమే స్పందించి తొలగించిన గుడిసెలను పునర్నిర్మాణం చేసి ఆ పేద కుటుంబాలను ఇల్లులు అప్పగించాలని గుడిసెలను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

ఏపీ రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో

# షుగర్ ఫ్యాక్టరీ బకాయిలకై కలెక్టరేట్ వద్ద నిరసన

## కలెక్టర్‌కు వినతి




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):** గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు కార్మికులకు పూర్తి బకాయిలు వెంటనే చెల్లించాలని సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తూ కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు లు మాట్లాడుతూ రాష్ట్రంలోనే సహకార రంగంలో నడుస్తున్న ఏకైక షుగర్ ఫ్యాక్టరీ ప్రభుత్వం ఆదుకోకుండా ఫ్యాక్టరీ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మార్చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. షుగర్ ఫ్యాక్టరీ లేకపోతే చోడవరం పరిసర ప్రాంతాల్లో 11 మండలాలు ప్రజలకు చెరుకు ప్రత్యామ్నాయ లేక రైతులు కార్మికుల రోడ్డును పడతారన్నారు. ఈ ఏడాది షుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభించిన దగ్గర నుంచి ఎన్నో ఒడిదుడుకులకు లోనైన ఫ్యాక్టరీ ఇటు రైతులను అటు కార్మికులకు అగ్ని పరీక్ష పెట్టిందని అన్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కి చెరుకు తోలిన రైతులకు ఇవ్వాల్సిన పూర్తి బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని వచ్చే సీజన్లో ఫ్యాక్టరీ నడుస్తుందో లేదో అని అనుమానంతో ఈ ప్రాంత రైతాంగం ఆందోళన చెందుతున్నారని ప్రభుత్వం వెంటనే వచ్చే సీజన్ కోసం స్పష్టమైన ప్రకటన చేసి రైతులకు విత్తనాలు, ఎరువులు పురుగుమందులు అందించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ ఓవరాయిలింగ్ సంబంధించిన నిధులను గ్రాంట్ గా మంజూరు చేయడంతో పాటు ఫ్యాక్టరీ ఆధునికరణకై ప్రభుత్వం నిధులను కేటాయించి ఆధునికరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకై ప్రభుత్వం చొరవ చూపకపోతే భవిష్యత్తులో రైతాంగం, కార్మికులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిక చేశారు. అనంతరం స్పందన కార్యక్రమంలో ఆర్డీవో కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, నాగిరెడ్డి సత్యనారాయణ, తాతబాబు, జగ్గప్పారావు, నాయుడు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలి

## జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.అర్.ఎస్.) లో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించి ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేందుకు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, పత్యేక డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఏపీఐఐసీ మనోరమ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ఆర్జీలపై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేందుకు కృషి చేయాలని తెలిపారు. ప్రజలు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కరించిన వినతులను ధరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని ఎడల దరఖాస్తుదారునికి అందుకుగల కారణాలను వివరించాలని అన్నారు.

విభిన్న ప్రతిభావంతుల అర్జీలను ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.అర్.ఆర్.సి. ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి నేరుగా వారి వద్దకు వెళ్లి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# లేటరైట్ తవ్వకాలపై మాజీ ఎమ్మెల్యే గణేష్ ఫిర్యాదు



**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** నాతవరం మండలంలోని సుందరకోట పంచాయతీ బమిడికలోద్ది ప్రాంతంలో జరుగుతున్న లేటరైట్ తవ్వకాలపై నర్సీపట్నంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో జిల్లా కలెక్టర్ కు నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నాతవరం మండలం సుందరకోట పంచాయితీ బమిడికలోద్ది ప్రాంతంలో జరుగుతున్న లేటరైట్ తవ్వకాలలో జరుగుతున్న అక్రమాలపై నర్సీపట్నం వచ్చిన జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశామన్నారు.

గత నాలుగు రోజులుగా త్రవ్వకాలు జరుగుతున్నాయని, ఈ త్రవ్వకాలు ప్రభుత్వ అనుమతితో జరుగుతున్నాయా లేక కోర్టు ఆదేశాల మేరకు జరుగుతున్నాయా తెలపాలని కోరామన్నారు.

గత ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఇది లేటరైట్ కాదు బాక్సైట్ తవ్వుకు పోతున్నారని ఆరోపించారని, మరి మీరెందుకు ఇప్పుడు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. కోర్టు ఆదేశాలతో జరుగుతుంటే ఎవరు దానిని ఆపలేరని, అయితే అక్కడ జరుగుతున్న అక్రమాలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చామన్నారు.

గని తవ్విన తర్వాత గని ప్రదేశంలో వే బ్రిడ్జి ఉండాలని, కాకినాడ జిల్లాలో వే బ్రిడ్జ్ లో బరువు నమోదు చేస్తున్నారన్నారు. ఇది అక్రమమన్నారు. రోజూ 5 వేల టన్నులు ఖనిజం లారీలతో తరలిపోతుంటే కేవలం 1000 టన్నులకు మాత్రమే రాయల్టీ చెల్లిస్తున్నట్లు చూపిస్తున్నారని ఆరోపించారు. ఈ త్రవ్వకాలపై గత ప్రభుత్వ హయాంలోనే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు పెండింగ్ లో ఉందని మరి ఎలా తవ్వకాలు జరుపుతున్నారో తెలపాల్సిన అవసరం ఉందన్నారు. బమిడికలోద్ది తవ్వకాలపై జిల్లా కలెక్టర్ కు కూలంకషంగా వివరించామని, నిబంధనలు పాటించకుండా జరుగుతున్న త్రవ్వకాలు నిలుపుదల చేయాలని కలెక్టర్ ను కోరామన్నారు. దీనిపై కలెక్టర్ తదుపరి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## భక్తి, శ్రద్ధలతో శ్రీరామరక్షా రథయాత్ర

**రాంబిల్లి, (విశాఖ సమాచారమ్):-** మండలంలోని మూల కొత్తూరు, మూడు జంప గోకవాడ , కొత్తూరు, మామిడివాడ, నారాయణపురం, చెరువుపల్లి గ్రామాలలో విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించిన శ్రీరామరక్షా రథయాత్ర భక్తిశ్రద్ధలతో జరిగింది. ప్రతి గ్రామంలోనూ శ్రీరామ రక్షా రథం కోసం మంగళ హారతులతో,కోలాటాలతో, భజనలు, కీర్తనలుతో పొలిమేర దగ్గర ఎదురుచూస్తూ రథం రాగానే ఘనంగా స్వాగతం పలికి గ్రామాల్లోకి తీసుకెళ్ళి అయోధ్య రాముడే మా గ్రామానికి వచ్చాడని ఆనందోత్సాహలతో దర్శించుకున్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రసాదం వితరణ జరిగింది. ముఖ్య అతిథిగా ఎలమంచిలి పురపాలక సంఘం చైర్ పర్సన్ పిలా రామకుమారి హాజరయ్యారు.



కోలాట బృందాల కళాకారులను అభినందించారు. వసంతవాడ దిన్ బాబు, కలిదిండి శివాజీ బహదూర్, దాట్ల వర్మ, బోరవెల్లి ప్రమోద్ కుమార్, ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు, వర్మ రాజు, రఘురాజు, ఆడారి గంగాధర్, కొల్లి అప్పారావు ,చింతకాయల రాజు,పప్పు ఈశ్వరరావు సర్పచులు, ఎంపీటీసీలు, పాల సొసైటీ అధ్యక్షులు, విశాఖ డైరీ సూపర్వైజర్లు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అన్న సమారాధన ప్రారంభించిన రామ్‌కి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** అనకాపల్లి తాకాశి వీధి లో పుట్టలో స్వయంభూగా వెలసిన శ్రీ నూకంభిక అమ్మవారు గంధం అమావాస్య సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భీమర శెట్టి రామ్కి అమ్మవారి ప్రత్యేక పూజలు చేసి భారీ అన్న సమారాధాన్ని ప్రారంభించారు, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తాకాసి రాజేష్,ఆలయ వేవస్థాపక, ధర్మకర్త , తాకాశి కన్నబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ తాకాసి కిషోర్,తాకాశి వీధి పంచాయతీ పెద్దలు, ఉత్సవ కమిటీ, సభ్యుల, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, పాల్గొన్నారు. తాకాశి కొండల రావు, తాకాశి సూర్యారావు, బేతి ఈశ్వర రావు, బోయిన వరహాలు తాడి రామకృష్ణ, గంగుపోవు మహేష్ దోర, తాకాశి సత్యం దోర, తాకాశి నాగేష్, తాకాశి విశ్ వేశ్వరావ్,అదట రమణ బాబు, పలక చంటి, దొండ రామారావు,తాకాశి కిషోర్, తాకాశి నరేష్, తాకాశి అనిల్, కారుకొండి కన్నా, పల్లెల సురేష్, బలి రెడ్డి సత్య, చింతల నవీన్,బుర్ర అశోక్, బుగత అశోక్,తాకాశి వీధి ప్రజలు, పాల్గొన్నారు.

## భారీగా డిఫెన్స్ మద్యం బాటిల్స్ పట్టివేత



**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** నర్సీపట్నం మున్సిపాలిటీ పెద్దబొడ్డేపల్లిలో ఒక ఇంటిలో అక్రమంగా నిలువ ఉంచిన 83 డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు నర్సీపట్నం ఎక్సైజ్ సీఐ కే సునీల్ కుమార్ తెలిపారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శ్రీరామచంద్రమూర్తి, అనకాపల్లి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎన్ఫోర్స్మెంట్ సుర్జిత్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి సుధీర్ ఆదేశాల మేరకు పెద్ద బొడ్డేపల్లి శ్రీరామకాలనీలోని ఒక ఇంటిలో పెద్ద ఎత్తున డిఫెన్స్ మద్యం బాటిళ్లు ఉన్నాయనే సమాచారంతో ఎక్సైజ్ సిబ్బంది, స్థానిక వీఆర్వో , వీఆర్ఏ లతో కలిసి ఆదివారం నిఘా ఏర్పాటు చేశారు. ఆ ఇంటి వద్ద ఒక వ్యక్తి చేతి సంచితో బయటకు వస్తుండగా అతనిని పట్టుకొని , ఆ ఇంటిని సోదా చేయగా 14 బ్రాండ్లకు చెందిన ఒక్కొక్కటి 750 ఎం ఎల్ మద్యం నింపిన 83 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి మార్కెట్ విలువ రూ. 90,800 ఉంటుందని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని సీఐ కే సునీల్ కుమార్ తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, అభిషేక్, హెడ్ కానిస్టేబుళ్లు నాగ శంకర్, బాబురావు, కానిస్టేబుల్ లావణ్య పాల్గొన్నారు.

## మేయర్ పీలా కు అభినందనలు తెలిపిన టిడిపి నాయకులు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్ గా ఎన్నికైన సందర్భంగా సోమవారం పీలా శ్రీనివాస్ ను పరవాడ టిడిపి నాయకులు మాజీ జడ్పిటిసి పైలా జగన్నాధరావు, మాజీ ఎంపీపీ మాధం శెట్టి నీలబాబు, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి సాలువా తో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సాలాపు మోహన్,కూండ్రపు శ్రీ రామ్ మూర్తి, వర్రి వసంత రావు పాల్గొన్నారు.

## నూతనంగా ఎన్నికైన మేయర్ పీలాను సత్కరించిన తెదేపా నేతలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** విశాఖపట్నం జీవీఎంసీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మేయర్ పీలా శ్రీనివాసరావు ను సోమవారం రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర సత్కరించారు. ఆయనతోపాటు 82, 83 వార్డుల తెలుగుదేశం పార్టీ ఇన్చార్జీలు పోలవరపు త్రినాధ్ బోద్ధపు ప్రసాదు పీలాను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఆకుల నానాజీ, కర్రి సుబ్రహ్మణ్యం, ఎస్ భానుచందర్ (అఖి) దీనబంధు తదితరులు పాల్గొన్నారు.

2nd pages1.qxd 4/28/2025 7:38 PM Page 7



# మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం

● ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం ● మత్స్యకారుల వేట నిషేధ కాలంలో ఇచ్చే భృతి రెట్టింపు ● మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ● జిల్లాలోని మత్స్యకారులకు రూ.7.59 కోట్లు ఆర్థిక సహాయం అందజేత

**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్రంలోని మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు మత్స్యకారుల సేవలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర చిన్న,మధ్యతరహా పరిశ్రమలు, ప్రవాసాంధ్రుల సాధికారిత, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. దీనిలో భాగంగానే వేట నిషేధకాలంలో అందజేసే భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు రెట్టింపుచేసి ఎన్నికల సమయంలో మత్స్యకారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రారంభించిన మత్స్యకారుల సేవలో కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 3,796 మంది తీరప్రాంత మత్స్యకారులకు వేటనిషేధ కాల భృతి కింద ఒక్కొక్కరికి రూ.20 వేల వంతున రూ.7.59 కోట్ల మొత్తానికి సంబంధించిన చెక్కును మంత్రి కొండపల్లి శ్రీనివాస్, శాసనసభ్యులు లోకం నాగమాధవి, పూసపాటి అదితి గజపతి, ఎం.ఎల్.సి. ఇందుకూరి రఘురాజు, జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తదితరులు అందజేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో 1,29,718 మంది మత్స్యకారులకు వేటవిరామ భృతి కింద రూ.259 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుందన్నారు. వెనుకబడిన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు ప్రతినెలా ఫించన్లు అందిస్తున్నామని చెప్పారు. మత్స్యకారులు చేపలవేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తున్నామని, వేటకు వెళ్లే మత్స్యకారుల బోట్లకు లీటరుపై రూ.9 సబ్సిడీ ఇస్తున్నట్టు చెప్పారు.

మత్స్యకారుల కోసం రాష్ట్రంలో 10 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, 5 ఫిషింగ్ హార్బర్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. మత్స్యకార మహిళలతో వీడ్ కల్చర్ ద్వారా చేపపిల్లల ఉత్పత్తిని ప్రోత్సహిస్తామన్నారు.

దేశంలో తయారవుతున్న మత్స్య ఉత్పత్తుల్లో మన రాష్ట్రం నుంచే 29శాతం ఉత్పత్తి అవుతున్నట్టు మంత్రి చెప్పారు. ప్రభుత్వం తమకు కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని తమ జీవనాన్ని మెరుగుపరచుకొనేందుకు మత్స్యకారులు ముందుకు రావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి కోరినట్టుగా జిల్లాలో చింతపల్లి వద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్ స్థానంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు గల సాంకేతిక అవకాశాలను పరిశీలిస్తామని చెప్పారు.



జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ జిల్లాలోని రెండు మండలాల పరిధిలోని 19 గ్రామాల్లో మత్స్యకారులు నివసిస్తున్నారని, వారిలో చేపలవేట జీవనాధారంగా 4 వేల మంది వరకు జీవిస్తున్నారని చెప్పారు. వీరిలో అర్హులైన 3,796 మందిని గుర్తించి వేట నిషేధకాల భృతి అందిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ప్రతిఏటా 5 వేల మెట్రిక్ టన్నుల మత్స్య సంపద ఉత్పత్తి అవుతోందని, దీనిని రెట్టింపు చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు.

నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం నాగమాధవి మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆలోచన చేస్తోందన్నారు. మత్స్య ఉత్పత్తుల నిల్వ, ప్రాసెసింగ్ కోసం అవసరమైన సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. మత్స్యకారులు దూర ప్రాంతాలకు వలస వెళ్లకుండా నిరోధించేందుకు ఈ ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని మంత్రిని కోరారు.

విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతి మాట్లాడుతూ మత్స్యకారులకు తెలుగుదేశం గతం నుంచే ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పైడితల్లి అమ్మవారి పండుగ జరుపుకోవడంలో మత్స్యకారులదే ప్రధానపాత్ర అని పేర్కొన్నారు. వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కట్టుబడి వున్నట్టు చెప్పారు.

ఎం.ఎల్.సి. ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ మత్స్యకారులకు రెట్టింపు సహాయాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయనకు అండగా నిలవాల్సి వుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, అవకాశాలు వినియోగించుకొని తమ జీవనప్రమాణాలు మెరుగుపరచుకొనేందుకు మత్స్య కారులు ముందుకు రావాలన్నారు.

మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు బర్రి చినప్పన్న, జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, జిల్లా మత్స్యశాఖ అధికారి విజయకృష్ణ, మత్స్యకార సంఘాల నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

# సకాలంలో అర్జీలను పరిష్కరించాలి

● పి.జి.ఆర్.ఎస్ కు డివిజన్/ మండల స్థాయి అధికారులు తప్పక హాజరవ్వాలి
● పి.జి ఆర్.ఎస్.లో వచ్చిన అర్జీలు 252 ● జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):-** నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించె ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమానికి డివిజన్, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు హాజరుకావాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, జాయింటు కలెక్టరు ఎమ్. జాహ్నవి, నర్సీపట్నం రెవిన్యూ డివిజనల్ వి.వి. రమణ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీల గూర్చి వెంటనే సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం డివిజన్ / మండల స్థాయి అధికారులతో పెండింగు అర్జీలపై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. పిజిఆర్ఎస్ కార్యక్రమానికి డివిజన్ / మండల స్థాయి అధికారులు మాత్రమే హాజరుకావాలని, దిగువస్థాయి సిబ్బందిని పంపించకూడదని ఆదేశించారు. డివిజన్ /మండల స్థాయిలో చిన్న చిన్న సమస్యలకు అక్కడే పరిస్కారం చూపిస్తే అర్జీదారులు అనకాపల్లి కలెక్టర్ కార్యాలయనికి వచ్చే అవకాశం ఉండదని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజలు అందజేసిన అర్జీల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కారం అయ్యే సమస్యలను పరిష్కరించి ధరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని ధరఖాస్తుల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారి అర్జీల స్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేసి, నిర్ణిత సమయంలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్.ఎన్.మూర్తి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వీర జ్యోతి, ఎంపీడీఓ ఉషశ్రీ, తహసీల్దార్ రామారావు, మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, అధికారులు, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో ముద్దాయిలకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ.లక్ష జరిమానా

చోడవరం 9వ అదనపు సెషన్స్ జడ్జి కె.రత్నా కుమార్ తీర్పు

జరిమానా చెల్లించని పక్షంలో మరో 6 నెలల సాధారణ జైలు శిక్ష విధించనున్నట్లు కోర్టు ప్రకటన



**చోడవరం, (విశాఖ సమాచారమ్):-** చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధి పోలీసు సిబ్బంది, ఎస్సై ఎ.కోటేశ్వరరావు నేతృత్వంలో 2017 డిసెంబర్ 28వ తేదీన ముందస్తుగా రాబడిన సమాచారం మేరకు ఉదయం 9 గంటల సమయంలో చీడికాడ మండలంలోని జి కొత్తపల్లి శివారులో తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి అక్రమ రవాణా పాల్పడుతున్న నిందితులను తనిఖీ చేసి వారి వద్ద 100 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వెంటనే కేసు నమోదు చేసి, సక్రమ దర్యాప్తు చేపట్టి అభియోగపత్రం న్యాయస్థానంలో దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించిన ముద్దాయిల వివరాలు జాజిమొగ్గల సంతోష్,తండ్రి అప్పలనాయుడు, గెంజి మరిడిబాబు,తండ్రి నూకరాజు,జాజిమొగ్గల దేముడు,తండ్రి గంగయ్య, వీరు ముగ్గురు బైలపూడి గ్రామం, చీడికాడ మండలం అనకాపల్లి జిల్లా కు చెందిన వారిని తెలిపారు. కేసు పోరాఫరాల పరిశీలించిన తర్వాత అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ యూ.వెంకట రావు సమర్థంగా వాదనలు వినిపించగా,చోడవరం 9వ అదనపు సెషన్స్ జడ్జి కె.రత్నా కుమార్ ముద్దాయిలకు ప్రతి ఒక్కరికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు ప్రకటించారు.జరిమానా చెల్లించని పక్షంలో 6 నెలల సాధారణ జైలు శిక్ష కూడా విధించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా,దర్యాప్తు అధికారి ఎస్సై ఎ.కోటేశ్వరరావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ యూ.వెంకట రావు,కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది సహా ఈ విజయానికి కృషి చేసిన అధికారులందరికి అభినందనలు తెలిపారు.

# మా గ్రామాలకు రోడ్లు, సాగునీరు, పాఠశాల సౌకర్యాలు కల్పించండి మహాప్రభో

- నర్సీపట్నంలో డోలీమోతలతో ఆదివాసీల విన్నూత్న ర్యాలీ
- జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం





**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** తమ గిరిజన గ్రామాలకు రోడ్లు, త్రాగునీరు, పాఠశాలల సౌకర్యాలు కల్పించాలని, తమ భూములకు రక్షణ కల్పించాలంటూ సోమవారం నర్సీపట్నం డివిజన్లోని 15 గ్రామాలకు చెందిన ఆదివాసీలు అబిద్ సెంటర్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకు డోలిమోతలతో విన్నూత్న ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో పలువురు చిన్నారులు కూడా పాల్గొనడం విశేషం. అనంతరం నర్సీపట్నంలో జరుగుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే గోవిందరావు మాట్లాడుతూ, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్లోని ఆదివాసీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గొలుగొండ మండలం డొంకాడ గ్రామానికి రోడ్డు నిర్మాణం శంకుస్థాపన చేయాలని, తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. 2023లో కరక రోడ్డు నుండి డొంకాడ గ్రామ వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.1 కోటి 60 లక్షలు మంజూరు చేశారని కానీ నేటి వరకు పనులు ప్రారంభించలేదని విమర్శించారు. గ్రామంలోని 14 మంది చిన్నారులు విద్యాభ్యాసం కోసం 6 కిలోమీటర్లు కాలినడకన కొండ దారిలో వెళ్తున్నారని, తక్షణమే డొంకాడలో స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు. రోలుగుంట మండలంలోని నీలుబంద, జీలుగులోవ, పశువుల బంధ, గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పనసలపాడు, కౌగుంట గిరిజన గ్రామాలలోని గిరిజన భూములకు రక్షణ కల్పించాలని కోరారు. 2022 లో లోసింగి గ్రామంలోని 50 మంది పి వి టి జీ గిరిజనులకు జగనన్న కాలనీ లేఅవుట్ మంజూరు చేశారని, రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల పిల్ల నిర్మాణం చేపట్టలేకపోయారన్నారు. ఇప్పుడు రోడ్డు సౌకర్యం ఏర్పడిందని, పెద్దగరువు, పిత్రి గడ్డ, లోసింగి గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చేపడతామని, హౌసింగ్ అధికారులు సలహాలు సూచనలు ఇచ్చేలా వారిని ఆదేశించాలన్నారు. కొవ్వకుంట, పనసలపాడు గ్రామాల్లో గిరిజనేతరులకు ఇచ్చిన పట్టాలు తక్షణమే రద్దు చేయాలని, ఆ భూములపై జాయింట్ కలెక్టర్ సమగ్రమైన దర్యాప్తు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాక గిరిజనుల సాంప్రదాయ బద్దంగా వస్తున్న జీలుగుకల్లు సేకరించి అమ్ముతుంటే కేసులు పెడుతున్నారని, గిరిజన గ్రామాల్లో జీలుగు కల్లు సేవనం సాంప్రదాయమని, దీనిపై సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు గెమ్మెల వాసు, కొండతాంబిల సత్తిబాబు, కొండతాంబిల వెంకటరావు , పెద్ద సంఖ్యలో ఆదివాసి మహిళలు పాల్గొన్నారు.

# పందూరు-లంబసింగి -పాడేరు - అరకు -సింహాచలం వృత్తకార టూరిజం ప్యాకేజీ కి సి ఎం 73 హిల్స్ ఇన్ఫ్రా ముందడుగు

## టూరిజం అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం చేయుట ఇచ్చి ప్రోత్సాహించాలి

రిసార్ట్ ల్ గ్లాస్ హౌస్, కాటేజీలు





73 హిల్స్ ఇన్ఫ్రా రిసార్ట్స్ అధినేత వి భిక్షు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో టూరిజం పెంచేందుకు తీసుకుంటున్న లక్ష్యం కి అనుగుణంగా అనకాపల్లి జిల్లా కోటఊరట్ల మండలం పందూరు లో వున్న సి ఎం ఇన్ఫ్రా 73 హిల్స్ యాజమాన్యం టూరిస్ట్ డవలప్మెంట్ కోసం ముందడుగు వేస్తోంది. టూరిస్టులకు 73 హిల్స్ రిసార్ట్స్ నుండి లంబసింగి, పాడేరు, అరకు, మీదుగా సింహాచలం టూరిజం సర్కిల్ ని రూపొందించి రెండురోజులపాటు ప్యాకేజి రూపొందిస్తున్నట్లు వాసన భిక్షు తెలిపారు. ఇందు కోసము అవసరమైన బస్సులు కొనుగోలు చేయటంతో పాటు, తమ 73హిల్స్ రిసార్ట్స్ లో క్యాంపు చేసేందుకు అవసరమైన కాటేజీలు, స్విమ్మింగ్ పూల్,బాలబాలికలకు క్రీడా పరికరాలు ఏర్పాటు తో పాటు ఎంతో అనుభవం వున్న కుక్ లతో అత్యంత నాణ్యమైన పరి శుభ్రమైన విజిటేరియన్, నాన్ విజిటేరియన్ వంటకాలతో భోజనం ఏర్పాట్లు కూడా ప్యాకేజి లో కలిసి ఉండేలా ప్యాకేజి రూపొందిస్తున్నామని భిక్షు తెలిపారు. ఎంతో ఆహ్లాదం కలిగించే ఈ 73 హిల్స్ రిసార్ట్స్ లో ఇప్పటికే అధికార అనధికారుల ఫంక్షన్లు నిర్వహించేందుకు కాటేజిల నిర్మాణాలు కొన్ని పూర్తీ అయినాయని ఆయన అన్నారు.

అయితే ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా తాము టూరిజాన్ని ప్రోత్సహించేందుకు సిద్ధమవుతున్న తమ సంకల్పానికి ప్రభుత్వం తగిన ప్రోత్సాహం ఇచ్చేందుకు అవసరమైన ఆర్థిక చేయూత ఇవ్వాలని భిక్షు ఈ రోజు ఆ 73హిల్స్ రిసార్ట్ ని సందర్శించిన ఈ ప్రతినిధికి తెలిపారు.

ఇప్పటికే తమ రిసార్ట్ లో వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ఎర్ర చందనం వృక్షాలతో వున్న ప్లాట్లు కొనుగోలు చేసి కాటేజీలు నిర్మించారని, వాటి అజమాయిషీని తామే చేపట్టి వారికి ఆదాయం సమకూర్చే బాధ్యత కూడా తామే చూస్తున్నట్లు ఒక ప్రశ్నకు బదులిచ్చారు.

ప్రభుత్వం తగిన చేయూత ఇస్తే ఇదొక ప్రముఖ పర్యాటక నిర్వహణ చేసేందుకు వీలుకలుగుతుంది. ఇంతటి అందమైన ప్రకృతి తో అలరారుతున్న సి ఎం 73 హిల్స్ ఇన్ఫ్రాకి చేయూత ఇచ్చి పాండూర్ – లంబసింగి -అరకు -సింహాచలం లను కలిపే వృత్తాకార టూరిజం ప్యాకేజీ కి చేయూతనివ్వాలని ఆ ప్రాంతప్రజలుకూడా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కారణం తమ మండలం, గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అశ!

# ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సమగ్ర సర్వే

- యుద్ధ ప్రాతిపదికన ఆక్రమణల తొలగింపు
- జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్



**పాడేరు, (విశాఖ సమాచారమ్):-** ప్రభుత్వ భూములు దురాక్రమణలపై సమగ్రమైన సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారుల పైనే ఉందన్నారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలులో ప్రభుత్వ భూముల ఆక్రమణనల తొలగింపు కు ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. భూముల ఆక్రమణల తొలగింపుకు కార్యచరణ ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గ్రామ సర్వేయర్, వి ఆర్ ఓ, పంచాయతీ కార్యదర్శి సంయుక్తంగా గ్రామాల్లో బంజరు భూములు, గ్రామ కంఠం ప్రభుత్వ భూమి ఆక్రమణలపై సర్వే చేసి నివేదించాలని చెప్పారు. సర్వేలో రెవెన్యూ, సర్వే అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఆక్రమణనలకు పాల్పడిన వ్యక్తులకు నోటిస్ లు జారీ చేసి వారం గడిచిన తరువాత అనధికార ఆక్రమణలను అధికారులు తొలగించాలని స్పష్టం చేసారు. చిన్న వాళ్లైనా పెద్దవాళ్లైనా, చిన్న ఇల్లు లేదా పెద్ద ఇల్లైనా ప్రభుత్వ భూముల్లో అనధికారకంగా నిర్మిస్తే తొలగించాలని సూచించారు. రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు ,పంచాయతీ అధికారులు సంయుక్తంగా యుద్ధ ప్రాతిపదికన ఆక్రమణనల తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. రహదారులు భవనాల శాఖ, పంచాయతీ రాజ్ (పంచాయతీ) నీటి పారుదల శాఖల భూముల ఆక్రమణలను గుర్తించి తొలగింపు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామ కంఠం భూముల్లో అధికారకంగా, అనధికారంగా ఎవరు ఉంటున్నారో గుర్తించాలని స్పష్టం చేసారు. రహదారులు భవనాల భూములను గుర్తించి డీమార్కు చేయలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి బి. లవ రాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్.కుమార్, సర్వే సహాయ సంచాలకులు కె. దేవేంద్రుడు డి ఎస్పీ షేక్ షహాబాజ్ అహమ్మద్, రహదారులు భవనాల శాఖ ఇ ఇ బాల సుందర బాబు, ఎస్ ఎం ఐ ఇ ఆర్. రాజేశ్వరరావు, డి. ఇ. ఆర్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పక్కన వాహనాలు పార్కింగ్

ఈ మార్గంలో పయనించే వాహన సాధకులకు ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు - ప్రయాణికుల ఆవేదన




**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** మండల కేంద్రమైన జి.మాడుగులలో రహదారికి ఇరువైపులా వాహనాలను ఇష్టానుసారం నిలిపివేయడంతో ఈ మార్గంలో పైనుంచే వాహన వాహన చోధకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉపపక్క జాతీయ రహదారి పనులలో భాగంగా రాధా కిరివైపులా కాలువ పనులు జరుగుతున్నాయి. దీంతో మూడు రోడ్ల జంక్షన్ ప్రైవేట్ జీపులు ఆటోలు ద్విచక్ర వాహనాలు ఇష్టానుసారం నిలిపివేయడంతో ఈ మార్గంలో పైనుంచే వాహన చోధకులు ట్రాఫిక్ జామ్ తో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పోలీసు శాఖ స్పందించి రాధా కిరువైపులా వాహనాలు నిలుపుదల చేయకుండా ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని ఏం మార్గంలో ప్రయనించే వాహన చోధకులు, మండలప్రజలు కోరుతున్నారు.

2nd pages1.qxd 4/28/2025 7:38 PM Page 8







# పంత్ పేలవ ఫామ్‌కు అదేమీ కారణం కాదు: జహీర్ ఖాన్



**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్ 2025 సీజన్ లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ 10 మ్యాచుల్లో 110 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఒక్క హాఫ్ సెంచరీ (63) ఉంది. మిగిలిన తొమ్మిదింట్లో కేవలం 47 పరుగులే చేయడం గమనార్హం. ఐపీఎల్ మెగా వేలంలో రూ.27 కోట్లను సొంతం చేసుకున్న అతడు పేలవ ఫామ్‌ను కొనసాగించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. భారీ ప్రైస్ ట్యాగ్ వల్లనే అతడు ఇబ్బందిపడుతున్నాడనే వ్యాఖ్యలు వినిపించాయి. వాటికి లఖ్‌నవూ మెంటార్ జహీర్ ఖాన్ సమాధానం ఇచ్చాడు.

“ధరకు, ఆటకు ఎలాంటి ముడిపెట్టను. పంత్ అద్భుతమైన నాయకుడు. ఆ విషయంలో నేను హామీ ఇవ్వగలను. సారథిగా అతడి పనితీరు బాగుంది. బ్యాటర్‌గా మాత్రం పంత్ నుంచి ఇంకా మంచి ఇన్నింగ్స్ రాలేదు. మిడిలార్డర్‌లో రానున్న మ్యాచుల్లో తప్పకుండా అతడు ప్రభావం చూపిస్తాడని భావిస్తున్నా. ఒక్కసారి క్లిక్ అయితే చాలు అతడిని ఆపడం కష్టం. ప్రైస్ ట్యాగ్‌తో ఒత్తిడిగా ఫీలవుతున్నాడని అనుకోవడం లేదు. అతడిది అలాంటి వ్యక్తిత్వం కాదు. గత మ్యాచులో ఏం జరిగిందో అది ముగిసిన పేజీ. తర్వాత ఏమి జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. పంత్ చాలా ఆశావాద క్రికెటర్. సానుకూలంగా ఉండే వ్యక్తి. మా నుంచి ఎప్పుడూ అతనికి మద్దతు దొరుకుతూనే ఉంటుంది” అని జహీర్ వెల్లడించాడు.

# ఐపీఎల్ 2025 సీజన్.. కేఎల్ రాహుల్ వికెట్ నా ఫేవరెట్: ప్రసిద్ధ్ కృష్ణ




గుజరాత్ టైటాన్స్ జైపుర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో ఇవాళ తలపడనుంది. ఈక్రమంలో జీటీ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

విజయాల వెనక పేసర్ ప్రసిద్ధ్ కృష్ణదీ కీలక పాత్రే ఉంది. బ్యాటింగ్‌లో సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్, జాస్ బట్లర్ అదరగొట్టేస్తుండగా సిరాజ్, ఇషాంత్‌శర్మతో కలిసి ప్రసిద్ధ్ పేస్ భారాన్ని మోస్తూ జట్టును గెలిపిస్తున్నాడు. అత్యధిక వికెట్లు తీసి టాప్-3లో ప్రసిద్ధ్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. మెగా వేలంలో రూ.9.50 కోట్లు వెచ్చించి గుజరాత్ తీసుకుంది. ఇప్పటివరకు 8 మ్యాచుల్లో 16 వికెట్లు పడగొట్టాడు. ఇందులో తనకు కేఎల్ రాహుల్ వికెట్ ఎంతో ఇష్టమని ప్రసిద్ధ్ వ్యాఖ్యానించాడు. అలాగే లాలాజలంతో పేసర్లకు అదనపు ప్రయోజనం దక్కుతుందని పేర్కొన్నాడు.

“ఈ సీజన్‌లో నేనేమీ కొత్తగా చేయడం లేదు. నా సన్నద్ధత గతం కంటే బాగుంది. నేను దేనిమీద మెరుగుకావాలనే దానిపై దృష్టిపెట్టా. గంటలతరబడి ఆశిశ్ నెహ్రాతో సంభాషించా. కొద్ది నెలల్లోనే అతడి నుంచి కీలక విషయాలను నేర్చుకున్నా. పరిస్థితులను త్వరగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాం. మంచి ఫామ్‌లో ఉంటే సరైన లెంగ్త్‌తో బౌలింగ్ చేయొచ్చు. బంతిపై పట్టుంటే ఏ ఫార్మాట్‌లోనైనా ఆడొచ్చు. వికెట్లు రావడమనేది ఆటలో భాగం. బౌలింగ్ బాగా చేయడమే ముఖ్యం. ఇప్పటివరకు ఈ సీజన్‌లో నేను తీసిన 16 వికెట్లలో కేఎల్ రాహుల్‌ను ఔట్ చేయడం నచ్చింది. అదే నా ఫేవరెట్ వికెట్. తీవ్ర ఒత్తిడిలో బంతి చాలా లేట్‌గా స్వింగ్ అయి వికెట్ వచ్చేలా చేసింది. కేఎల్ ఔట్ కావడంతోనే మ్యాచ్ మావైపు తిరిగింది. అందుకే, కేఎల్ వికెట్ నా ఫేవరెట్ అని చెబుతా” అని ప్రసిద్ధ్ వెల్లడించాడు.

# గ్రౌండ్ జీరో.. ఆ ఉగ్రవాదిని ఎలా మట్టుబెట్టారు?




ఇమ్రాన్ హష్మి కీలక పాత్రలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ ‘గ్రౌండ్ జీరో’ ఎలా ఉంది? ఎలాంటి థ్రిల్ పంచింది.

చిత్రం: గ్రౌండ్ జీరోబీ నటీనటులు: ఇమ్రాన్ హష్మి, సాయి తమంకర్, జోయా హుస్సేన్, ముకేశ్ తివారీ, రాఖీ రైనా, మిర్ మెహరూజ్ తదితరులుబీ రచన: సంచిత్ గుప్త, ప్రియదర్శ శ్రీవాత్సవ దర్శకత్వం: తేజస్ ప్రభ విజయ్


వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రాలు తరచూ ప్రేక్షకులను పలకరిస్తుంటాయి. అలా తాజాగా విడుదలైన చిత్రం ‘గ్రౌండ్ జీరో’. బీఎస్ఎఫ్ జవాన్ నరేంద్రనాథ్ ధర్ దూబే జీవిత కథ ఆధారంగా రూపొందిన ఈ మూవీ ఎలా ఉంది? ఏ మేరకు ఆకట్టుకుంది.

కథేంటంటే: అది 2001. నరేంద్రనాథ్ ధర్ దూబే (ఇమ్రాన్ హష్మి) డిప్యూటీ కమాండెంట్‌గా కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తూ ఉంటాడు. అక్కడి పోలీసులు, భద్రతా సిబ్బందికి ‘పిస్టల్ గ్యాంగ్’ నిద్రలేకుండా చేస్తుంటుంది. కాలేజ్‌కు వెళ్లే విద్యార్థులకు బ్రెయిన్‌వాష్ చేసి, విధుల్లో ఉన్న సైనికులను పాయింట్ బ్లాంక్‌లో కాల్చేలా ప్రేరేపిస్తుంది. ఒక్కో జవాన్‌ను చంపితే రూ.5వేలు చెల్లిస్తూ ఉంటుంది. వారిని పట్టుకునే క్రమంలో బీఎస్ఎఫ్‌కు కూడా ఓ కీలక విషయం తెలుస్తుంది. దేశంలో భారీ ఉగ్రదాడి జరగబోతోందని తెలుస్తుంది. అత్యున్నత పదవిలో ఉన్న ఓ మంత్రిపై దాడి జరుగుతుందని నరేంద్రనాథ్ అంచనా వేసి, ఆయన్ను సీఎం సేఫ్ హౌస్‌కు తరలిస్తారు.

నిజ జీవిత సంఘటనలను చెప్పే క్రమంలో వాస్తవికత పోకుండా చెప్పినప్పుడే అవి ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతాయి. ‘గ్రౌండ్ జీరో’ విషయంలో రచయితలు సంచిత్ గుప్తా, ప్రియదర్శి శ్రీవాత్సవకు మంచి మార్కులు పడతాయి. సినిమాను ఆద్యంతం ప్రేక్షకుడికి కనెక్ట్ అయ్యేలా తీర్చిదిద్దడంలో దర్శకుడు తేజస్ ప్రభా విజయ్ కూడా సక్సెస్ అయ్యారు. కథ, కథనాలు ఎక్కడా కూడా పక్కదారి పట్టకుండా తెరకెక్కించిన విధానం బాగుంది. ఘాజీబాబాను పట్టుకునే మిషన్ చుట్టూనే సినిమాను నడిపిన తీరు అలరిస్తుంది. ‘పిస్టల్ గ్యాంగ్’ను పట్టుకునే క్రమంలో సాగే సన్నివేశాలు ఆద్యంతం ఆకట్టుకుంటాయి. ఉగ్రదాడి మినిస్టర్‌పై కాకుండా పార్లమెంట్‌పై జరగడంతో కథ కీలక మలుపు తీసుకుంటుంది. అక్కడి నుంచి నరేంద్రనాథ్ ప్రయాణం, ఘాజీ బాబా కోసం సాగే అన్వేషణ ఉత్కంఠగా ఉంటుంది. హుస్సేన్ (మిర్ మెహరూజ్) అనే యువకుడికి ఉగ్రముఠా బ్రెయిన్ వాష్ చేసి నరేంద్రనాథ్‌ను చంపడానికి పంపుతుంది. చివరి నిమిషంలో అతడు మనసు మార్చుకుని నరేంద్రనాథ్‌కు సహకరించడంతో కథ నరేషన్ పూర్తిగా మారిపోతుంది. అతడి సాయంతో ఉగ్రమూలలను కనిపెట్టే సన్నివేశాలు ఆద్యంతం ప్రేక్షకుడికి థ్రిల్ పంచుతాయి. అయితే, ఉరి: ది సర్జికల్ స్ట్రైక్స్, బేబీ, ఆర్టికల్ 370 తదితర చిత్రాలను చాలా సన్నివేశాలు గుర్తు చేస్తాయి.

ఎవరెలా చేశారంటే: బీఎస్ఎఫ్ కమాండెంట్ నరేంద్రనాథ్‌గా ఇమ్రాన్ హష్మి చక్కగా నటించారు. ఆ పాత్ర కోసం ఆయన చేసిన రీసెర్చ్ తెరపై కనిపిస్తుంది. హుస్సేన్‌గా మిర్ మెహరూజ్ పాత్ర ఈ సినిమాకు కీలకం. మిగిలిన వాళ్లు తమ పరిధి మేరకు నటించారు. సాంకేతికంగా సినిమా బాగుంది. ముఖ్యంగా సినిమాటోగ్రఫీ చిత్రానికి హైలైట్. యాక్షన్ సీక్వెన్స్, ఏరియాల్ షాట్స్ చాలా అద్భుతంగా తెరపై ఆవిష్కరించారు.

# ఓటీటీలలో అలాంటి కంటెంట్ వద్దు.. సుప్రీంకోర్టు నోటీసులు జారీ




ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో ప్రసారం అవుతున్న కంటెంట్ పట్ల కేంద్రం ఇప్పటికే పలు హెచ్చరికలు జారీ చేసింది. ఏ రేటింగ్ ఉన్న కంటెంట్‌తో పాటు అశ్లీల కంటెంట్‌ను కూడా అందుబాటులో ఉంచడం చట్టరిత్యా నేరం అని, వీటిని కట్టడి చేసేలా నిబంధనలను రూపొందించాల్సింది కేంద్రమే’నని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం ఇప్పటికే పేర్కొంది. అయితే తాజాగా అశ్లీల కంటెంట్ ప్రసారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఓటీటీ సంస్థలకే కాకుండా పలు సామాజిక మాధ్యమాల హ్యాండిళ్లకు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, ఉల్లు, ఆల్ట్‌టీ ఓటీటీతో పాటు ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లకు సుప్రీమ్ కోర్టు నోటీసులిచ్చింది.

సామాజిక మాధ్యమాల్లో అశ్లీల కంటెంట్‌ను అడ్డుకోవాలని గతంలో పిల్ దాఖలైన విషయం తెలిసిందే. ఈ అంశంపై తాజాగా న్యాయస్థానంలో విచారణ జరిగింది. వాదనల అనంతరం అశ్లీల కంటెంట్‌పై కేంద్రం చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆన్‌లైన్ వేదికల్లో లైంగిక, అశ్లీల కంటెంట్ తీవ్రమైన విషయమని, వెంటనే ఈ అంశంపై విచారణ జరపాలని న్యాయవాది జైన్ విజ్ఞప్తి చేశారు. చట్టం ప్రకారం నిషేధించిన ఏ కంటెంట్‌ను ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో ప్రసారం చేయకుండా ఉండేలా చూడాలని ప్రభుత్వానికి కోర్టు సూచించింది.

# యువసేవ ఫౌండర్ పీలా హరిప్రసాద్ కి మదర్ తెరిసా అవార్డు!

- 1000 మందికి పైగా అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు జరిపిన”యువసేవ ఫౌండేషన్ “!...
- అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అమ్మ భాస్కర్!...



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** యువసేవ ఫౌండేషన్ కి అరుదైన గౌరవం దక్కింది నిన్న గాజువాకలో జరిగినటువంటి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ 14 వ వార్షికోత్సవం పురస్కరించుకొని యువసేవ ఫౌండేషన్ కి ఉత్తమ మదర్ తెరిస్సా అవార్డును నగర పోలీస్ కమిషనర్ చేతులమీదుగా ఫౌండర్ పీలా హరిప్రసాద్ కి అందజేశారు అలాగే చిన్న చిరుసత్కారంతో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అమ్మ భాస్కర్ మరియు అలాగే సంఘ సభ్యులు హరిప్రసాద్ కి ఈ సందర్భంగా ఆయనకి సన్మానించి సమాజంలో 1000 మంది కి పైచిలుక అనాథ మృతదేహాలకు అంతిమ, దహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న యువసేవ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. అలాగే సమాజం పట్ల నిస్వార్థంగా సేవలందిస్తున్నటువంటి ప్రసాద్ ని ఈ సందర్భంగా కమిషనర్ శంక బ్రత బాగ్చి అభినందించారు ఈ కార్యక్రమంలో జూనియర్ ఆర్టిసి రవితేజ, అమ్మ భాస్కర్ , కేఎన్ఆర్ అధినేత, సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కేజీబీవీ జూనియర్ కళాశాల అదనపు గదులు నూతన భవనాల కోసం శంఖుస్థాపన

**10 నెలల కాలంలో మాకవరపాలెం మండలానికి రూ.10 కోట్ల 70లక్షల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులు : సభాపతి అయ్యన్నపాత్రుడు**



**నర్సీపట్నం/మాకవరపాలెం, (విశాఖ సమాచారమ్):-** మండలం లోని భీమ బోయిన పాలెం లో రూ.168.02 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతుల భవనాల కోసం రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు భీమ బోయిన పాలెం కేజీవీబీ కళాశాల లో సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఏడాది కాలంలో నియోజకవర్గంలో రూ. 97 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఏడాదికి రూ.100 కోట్ల చొప్పున నిధులు లభిస్తే, నాలుగేళ్లలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనుమతులు లేకుండానే మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టారని, అయితే ఆ కాలేజీని అలా వదిలిపెట్టకుండా కార్పొరేట్ సంస్థలతో చర్చించి పూర్తి చేసే బాధ్యతను తీసుకుంటానని అన్నారు. నర్సీపట్నంలో డిగ్రీ కాలేజ్ మొదలుకొని ఇంజనీరింగ్ కాలేజ్ వరకు అన్ని తెలుగుదేశం పార్టీ హయాంలోనే వచ్చాయని అన్నారు. విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని స్పీకర్ అయ్యన్న అన్నారు. ఇదే కళాశాలలో చదువుకున్న ఇంటర్ మొదటి సంవత్సరం రెండవ సంవత్సరంలో మంచి మార్కులతో ఉత్తీర్ణత అయిన విద్యార్థినిలను అభినందించారు. 10 నెలల కాలంలో మాకవరపాలెం మండలానికి రూ. 10 కోట్ల 70లక్షల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులు 30పంచాయతీ లో చేపట్టినట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి ఒక స్మశాన వాటిక నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. భీమ బోయిన పాలెం పంచాయతీలో సీసీ రోడ్లు మరియు అభివృద్ధి పనులకు కోటి 5 లక్షల రూపాయలతో పూర్తి చేసినట్లు తెలిపారు. మాకవరపాలెం మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ గ్రాంట్ ద్వారా 113 వర్కులకు గాను సుమారు 10 కోట్ల 70లక్షల రూపాయలతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కస్తూరిబా పాఠశాల వద్ద నుండి విశాఖపట్నం ప్రధాన రహదారి వరకు వీధిలైట్లు ఏర్పాటుకు తోడ్పడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీ బస్ స్టాప్, సోలార్ సిస్టం ఏర్పాటు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్ వై పాత్రుడు, జనసేన కన్వీనర్, వెలమ కోఆపరేటివ్ డైరెక్టర్ సూర్యచంద్ర, గ్రామ సర్పంచ్ రుత్తల నందకిషోర్, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామనాయుడు, అధికారులు, కేజీబీవీ ఉపాధ్యాయులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ నూకంబిక ఉత్సవాలలో కూచిపూడి నృత్యాలకు విశేష ఆదరణ

## హైలెట్‌గా నిలిచిన శివశ్రీ నృత్య నికేతన్ చిన్నారుల నృత్య ప్రదర్శన





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అయిన అనకాపల్లిశ్రీ నూకంబిక అమ్మవారి రాష్ట్ర పండగ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నెల రోజులు పాటు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అమ్మవారి మహోత్సవాలు ఆదివారం రాత్రి కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య ఘనంగా ముగిసాయి. ముగింపు రోజు శ్రీకాకుళం శ్రీ శివశ్రీ నృత్య నికేతన్ వారిచే నాట్య ప్రవీణ డాక్టర్ శ్రీకాంత్ రఘుపాత్రుని నేతృత్వంలో జరిగిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. కళాకారులు చేసిన శ్రీనివాస కళ్యాణం, నరసింహస్వామి, శివ పార్వతులు, అమ్మవార్ల పై రూపొందించిన నృత్య రీతులు ఆబాల గోపాలన్ని అలరించాయి. వీరి ప్రదర్శన ఉత్సవాలకు హైలెట్గా నిలిచింది. ఈ నెలరోజుల ఉత్సవాలలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వివిధ ప్రాంతాల నుండి సుమారు ఐదువేల మంది కళాకారులు పాల్గొన్నారు. నెల రోజులు పాటు జరిగిన సాంప్రదాయం నృత్యాలు కళాభిమానులను విశేషంగా కట్టుకున్నాయి. మహోత్సవాలను మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్కి పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా క్రీడాకారుడు చిన్నమనేని లోకేష్ , పదవ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన షేక్ రిజ్వాన పర్వీన్, అరిసి వెంకట జయ, ఎండ అనిషా, పంపాన మౌనిక , లకు శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఉగాది పురస్కారాలు అందజేశారు . కాండ్రేగుల శ్రీరామ్ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ మెచ్చిన కవల సోదరులు గరినే సాయి కుమార్, గరినే సంతోష్ కుమార్ ప్రదర్శించిన శివతాండవం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులకు ప్రశంస పత్రాలతో సత్కరించారు. వాగ్దేవి వరదాయిని వ్యవస్థాపకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి నేతృత్వంలో 450 మంది భక్తులతో అమ్మవారికి ఘనమైన హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని నెలరోజులు పాటు జరిపించిన నిర్వాహకుల కు శాసనసభ్యులు కొణతాల చేతుల మీదగా చిరు సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర ,శ్రీ నూకంబిక అమ్మవారి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు), ఆలయ సహాయ కమిషనర్ వెంపల రాంబాబు, ఆలయ ధర్మకర్తలు సూరేసతీష్, దాడి రవికుమార్ పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి ఎర్రవరపు లక్ష్మి, కూటమి నాయకులు, భక్తులు నిర్వాహకులు తిమ్మాపాత్రునీ చక్రవర్తి, సకల గోవిందరావు , గండేపల్లి మురళి పాల్గొన్నారు.

# జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాస రావుకు శుభాకాంక్షలు





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కు మేయర్ గా కూటమి అభ్యర్థి పీలా శ్రీనివాసరావు సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటువంటి చారిత్రాత్మకమైన మార్పుకు దోహదపడిన కార్పొరేటర్లు అందరికీ మరొకసారి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న పీలా శ్రీనివాసరావు విశాఖ అభివృద్ధిలో కీలకమైన పాత్ర పోషిస్తారని వినూత్నమైన కార్యక్రమాలతో దేశంలోనే అత్యుత్తమ మున్సిపల్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నంకు మంచి రోజులు మొదలయ్యాయి అని మరోసారి గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ సారధ్యంలో విశాఖ నగరం అభివృద్ధి పథంలో మరింత ముందుకు దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు. మేయర్ పీలా శ్రీనివాసరావు నాయకత్వంలో విశాఖపట్నం మరింత ఉన్నతంగా అభివృద్ధి చెందాలని వైసీపీ పాలనలో గాడితప్పిన అభివృద్ధిని పట్టాలెక్కించాలని ఆకాంక్షించారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com